# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూలై 2024
వెల – ₹ 10.00

సంపుటి: 42    సంచిక: 03



గురు పూర్ణిమ (21 - 07 - 2024) సందర్భంగా 'సాయిబాబా'
పత్రిక పాఠకులందరికీ శుభాకాంక్షలు!

## ఈ నెల పండుగలు

జూలై 04 - శ్రీ స్వామి వివేకానంద ఆరాధన

జూలై 21 - గురు పూర్ణిమ

"సకల సృష్టికీ తండ్రి ఆ భగవంతుడే! తండ్రి ధర్మాన్ననుసరించి ఆయన సర్వులకూ తిండి, వెలుగు, గాలి, నివాసస్థలమూ ప్రసాదించాడు. సత్యాన్నరసి తెలుసుకోగల మేధాశక్తి, మనకు ఉత్తమ జీవిత విధానం తెలిపే దివ్యపురుషులను అనుగ్రహించాడు. అటువంటప్పుడు 'నా మతమే సత్యమైనది, మిగిలినవన్నీ తుచ్ఛమైనవే' అంటే ప్రేమమయుడు, సర్వజ్ఞుడు అయిన భగవంతుణ్ణి మానవమాత్రుడికంటే హీనుడుగా తలచినట్లేకదా! అలా అనేవారికి భగవంతుడు ప్రేమమయుడన్న నమ్మకం లేదన్నమాట. అట్టివారికి మతప్రచారం చేసే హక్కు లేదన్నమాట. తన బిడ్డలలో కొందరికి మాత్రం శాశ్వత సుఖానికి బాట చూపి, మిగిలిన బిడ్డలను శాశ్వత నరకాగ్ని పాలయ్యేలా చేసేవాడు మానవాధముని కంటే హీనుడు, అసలైన సైతానూ అవుతాడుగాని ప్రేమమయుడైన భగవంతుడెలా అవుతాడు?

భగవంతుడు సర్వజ్ఞుడు. ఏ జీవి ఏ మతానికి చెందాలో ఆయనకు తెలుసు. అది మరిచి అందర్నీ తన మతంలోకే మార్చాలని తలచేవారు భగవంతుని అజ్ఞానాన్ని సవరింపజూస్తున్నారన్నమాట. ఇది విశ్వాసమా?"

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# సాయి అవతరణే మానవాళికి గురుపూర్ణిమ

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

మానవుడు తన బాల్యంలో చిన్న చిన్న మాటల దగ్గర నుంచి జీవితంలో సర్వ విషయాలను మరొకరు నుండి నేర్చుకుంటాడు. ఇందులో భాగంగా ప్రకృతి నుండి వైజ్ఞానిక విషయాలు తెలుసుకోవడానికి కూడా మరొకరి బోధ అవసరమౌతుంది. అదే ప్రకృతి నుండి పారమార్థిక విషయాలను కూడా నేర్చుకోవడం మానవుడు ఉత్తమమైన గురువుల వద్ద నేర్వవలసిందే. భాగవతంలోని అవధూత-ఉద్ధవగీతలో సాక్షాత్తూ శ్రీకృష్ణుడి చేత కూడా ప్రశంసించబడిన పూర్ణ పురుషుడు- తాను ప్రకృతిలోని 24 మంది గురువుల నుండి ఏమి నేర్చి పరిపూర్ణతను సాధించాడో చెబుతాడు. దానినే పరమ ప్రామాణికంగా శ్రీ కృష్ణుడు ఉద్ధవునికి బోధిస్తాడు. తిరిగి ఆ బోధే మొదటి రెండు దత్తాత్రేయ అవతారాల చరిత్ర సంపుటమైన శ్రీ గురుచరిత్ర మనకు బోధిస్తుంది. మూడవ దత్తాత్రేయ అవతారమైన శ్రీ మాణిక్యప్రభువు కూడా తిరిగి జ్ఞానమలానే ఆర్జించినట్లు తన భక్తులతో చెప్పారు.

పారమార్థిక జ్ఞానమే లేని పామరజీవితం అసూయ, ద్వేషము, మమకారము మొదలైనవాటిని పెంపొందించి, ఇటు వ్యక్తిని, అటు సమాజాన్ని కూడా తారుమారు చేస్తుంది. జీవితానికి ఏకైక లక్ష్యమైన శాంతి, తృప్తి కొంచమైనా తొంగి చూడవు. అమావాస్యనాడు ఆకాశములో యథాపూర్వంగా చంద్రమండలం వున్నప్పటికీ సూర్యుని కాంతి భూమిపైకి ప్రతిబింబించనందువల్ల అగోచరమవుతుంది. అలానే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మన జీవితాలలో ప్రతిబింబించే గురుస్వరూపం లభ్యంకాకపోతే మానవజీవితం సాగర మధ్యంలో చిక్కిన దిక్సూచి, నావికుడు లేని నౌక లాగా వుంటుంది.ఏఅనంతవిశ్వం పైనచెప్పినమహనీయులందరికీ గురుస్వరూపమై బ్రహ్మజ్ఞానులుగా చేసిందో, శాంతి తృప్తులను వారి రూపంలో మూసపోసిందో అట్టి ప్రకృతి పామరులపాలిట దుఃఖసాగరంగా పరిణమిస్తుంది.

ఈ సృష్టిలోని అసంఖ్యాకమైన జీవులలో అదృష్టవశాత్తు వివిధ స్థాయిలలో ఆధ్యాత్మిక పరిపాకంగలవారు కూడా వుంటారు. పూర్ణగురుని సాన్నిధ్యం ప్రతివారికి లభ్యంకానప్పటికీ శాంతితృప్తులు కుదిర్చే ఆధ్యాత్మిక జీవనమొకటి వున్నదని మనకు తెలిపేవారు కొందరుంటారు. ఇట్టివారి సాంగత్యం శుద్ధపాడ్యమి నుండి నానాటికీ అభివృద్ధి చెందే చంద్రకళలవలె మన జీవితాల్లోకి ఆత్మజ్యోతిని ప్రసరింపజేస్తుంది. ఈ వికాసం పూర్ణగురు సందర్శనంతో పరిపూర్ణమౌతుంది. ఈ రహస్యాన్ని తెలుపుతుంది గురుపూర్ణిమ.

పూర్వజన్మ సుకృతం వలన పూర్ణగురుని సాంగత్యం ఎందరికో కలగవచ్చు. కానీ వారి వారి పరిపాకాన్ననుసరించి మాత్రమే వేరు వేరు సద్గురు భక్తులు ఫలితాన్ని పొందుతారు. అంతేకాదు పూర్ణగురుని సాంగత్యం జీవితంలోని కష్టసుఖాలు అనే మబ్బుతెరల మాటున మరుగవ్వనివ్వకుంటే వారి సాంగత్య ప్రభావం వలన--చంద్రుని ప్రభావం వలన కలువకు వలె, చెట్టు సాంగత్యంవలన కాయ పండైనట్లు-- అట్టి దృఢభక్తుల పాత్రత పెరుగుతుంది. ఈ వికాసములోని దశలను చంద్రకళలతో పోలిస్తే పూర్ణవికాసం కలిగిన దశను పున్నమితో పోల్చవచ్చు. అట్టి స్థితిపై తీవ్రమైన ఆకాంక్షకలిగి భక్తుని జీవితాన్ని వుంచగలిగినప్పుడే గురుసేవలో అట్టి స్థైర్యం చిక్కుతుంది.

*మిగతా 22వ పేజీలో*

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 జూలై - 2024 సంచిక:03

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాయి అవతరణే మానవాళికి గురుపూర్ణిమ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | పూజ్యశ్రీ మాస్టరు గారి కార్యదీక్ష | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి తృతీయ ఆరాధనా మహోత్సవము | శ్రీమతి టి.పద్మావతి | 09 |
| 05. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి రేవతి | 11 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 14 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 19 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి ఎం. అన్నపూర్ణమ్మ | 26 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ శ్రీనివాస్ | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా|| ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ప్రశ్న :- "మీరు సాయిని పూజిస్తున్నా ఆయన మీ కష్టాలు తొలగించలేదు గదా? ఆయనను విడచి గ్రహశాంతులు చేస్తే కష్టాలు తొలగుతాయి" అంటున్నారు కొందరు, ఇది ఎంతవరకు నిజం ?**

**– ఒక పాఠకుడు**

**జవాబు :-**కష్టసుఖాలు పూర్వపుణ్య పాపాల ఫలితాలే. గడియారం, ప్రొద్దును సూచించినట్లు, జాతకంలోని గ్రహాలు మన పూర్వపుణ్య పాపాల పాళ్ళు, క్రమము కొంతవరకే సూచించగలవు. గడియారంలో ముల్లు తిప్పేస్తే పొద్దుకూడ తిరిగిపోతుందా? కనుకనే యితర మతాలలో గ్రహశాంతులన్నవిలేవు. నేరం చేసినవాడు శిక్ష అనుభవించడం ధర్మంగాని అతడు పోలీసులను, న్యాయమూర్తులనూ తృప్తి పరచి శిక్ష తప్పుకోవడం న్యాయమా? ఈ గ్రహాలన్నీ ఆ దేవుని బంట్లే – పోలీసులు, న్యాయమూర్తులు ప్రభుత్వం యొక్క సేవకులైనట్లు. కర్మననుసరించి ఫలితాన్ని సూచించేలా దైవం వాటిని శాసించాడు. మనం చేసిన పూజల వలన దైవశాసనాన్ని కాదనగలమా? కాకుంటే ప్రభుత్వమే ఒక నేరస్థునిలో కల్గిన పరితాపానికి, పరివర్తనకూ మెచ్చి శిక్ష కొంత తగ్గించవచ్చు. అలానే సృష్టియంతటికీ ప్రభువైన భగవంతుడు గూడ! మనం మన పూర్వ పాపాలకు ఆయన న్యాయంగా అంటే సర్వజీవులపైన సమానమైన ప్రేమతో – మనకు విధించిన శిక్షను హృదయ పూర్వకముగా స్వీకరించి ఓరిమితో, ఆయన ధర్మపరతపట్ల, కరుణ పట్ల పూర్ణ విశ్వాసంతో అనుభవిస్తూ, మన పూర్వకర్మ దోషాన్ని అలా అనుభవం ద్వారా కడిగి వేసుకొనే అవకాశమిచ్చినందుకు ఆయనకు కృతజ్ఞత తెల్పుకుంటూ, విడవక ఆయనను ప్రార్థిస్తూంటే, మనలో కల్గిన పరివర్తన వలన మన ధర్మబుద్ధికి మెచ్చి జాలిచెందిన ఆ ప్రేమమయుడు తనకై తానే ఆ శిక్షను తగ్గిస్తాడు; పూర్తిగా రద్దు చేయడు. కారణం, అలా చేస్తే యిక జీవులన్నీ పాపాలే చేసి, శిక్ష అనుభవించబోయేముందు దైవాన్ని ప్రార్థిస్తారు! ఇక న్యాయమెవ్వరూ పాటించక, సాటి జీవులందర్నీ హింసిస్తుంటారు. కనుక ఆయన కర్మఫలాన్ని రద్దుచేయనందుకు ఆయనకు కృతజ్ఞతలే తెల్పుకోవాలి. ఆ భగవంతుడే సద్గురువు సాయి, కనుక నీ విశ్వాసమే సరియైనది. సాయి చెప్పినట్లు ఓరిమి, నిష్ఠలతో, అవగాహనతో సాయిని ప్రార్థించాలి. గ్రహశాంతులే నిజమయితే పాండవులు, రాముడు, హరిశ్చంద్రుడు ఎందుకు కష్టాలు పడతారు? ఇలాంటి అజ్ఞాన పూర్వకమైన కోరికలతో వివిధ దేవతలను ప్రార్థించేవారు అజ్ఞులని, వారి పాత్రతను బట్టి వారికి ఫలితమివ్వవలసినది అద్వయుడు (ఒక్కడే) అయిన భగవంతుడేనని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. తపస్సుతో కర్మదోషం తొలగించుకోవచ్చు. తపస్సంటే అవగాహన, ఓరిమిలతో కఠినమైన కష్ట జీవితాన్ని అంగీకరించి, భగవంతుణ్ణి ప్రార్థించడమే! అట్టి నిశ్చలభక్తితో సాయిని ప్రార్థిస్తుంటే సాయి చాలా వరకూ కష్టం తగ్గిస్తారని వారి చరిత్ర నిరూపిస్తున్నది. నీకు సలహా యిచ్చినవారు సాయిని మించిన జ్ఞాని కాదుకదా? 'శ్రీ సాయి ప్రబోధామృతము' చదివి మననం చేస్తే నీ మనస్సు స్థిరమవుతుంది.●

(అక్టోబర్ 2016 సాయిబాబా మాసపత్రిక నుండి)

# పూజ్యశ్రీ మాస్టరు గారి కార్యదీక్ష

## పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

పూజ్యశ్రీ మాస్టరుగారి కార్యదీక్ష అసామాన్యము. ఆయన ఏదైనా కార్యం తలపెట్టినప్పుడు అందరికీ శ్రేయస్కరమనిపిస్తే, ప్రారంభించేవారు. సంకల్పించిన పనిని సాధించేవరకూ కృషి చేస్తూనే వుండేవారు. మాటల సందర్భంలో ఆయనే ఒకసారి యిలా చెప్పారు: "ఎవరైనా సరే, ఏ పనైనా చేయదలచుకున్నప్పుడు ఆ పనిని గురించి క్షుణ్ణంగా ఆలోచించాలి. ఆ పని వలన కలిగే లాభనష్టాలను, కష్టసుఖాలను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. తరువాత ఆ పని చేయగలమా లేదా అనేది ఆలోచించి చేయగలమని అనుకున్నప్పుడే ప్రారంభించాలి. ప్రారంభించిన తరువాత పూర్తిచేయాలి. అప్పుడే తలపెట్టిన పనికి సార్థకత."

పూజ్యశ్రీ మాస్టరుగారిలోని ప్రత్యేకత ఏమిటంటే ఆయన చెప్పినదే చేశారు, చేసినదే చెప్పారు. ఆయన ఏ పనైనా ఎవరి సహాయ సహకారాలు లేకుండా తాము చేయగలమని అనుకుంటేనే ప్రారంభించేవారు. ఎవరి మీదనో ఆధారపడి ఏ పనైనా చేయదలచడం ఆయనకు ఏ మాత్రమూ అభిమతము కాదు. 'ఎవరైనా సహాయపడితే మంచిదే, పడకపోయినా మంచిదే, మనం ప్రారంభించిన పనిని మనమే చేసుకోవాలి' అనేదే వారి అభిప్రాయము. అవి స్వంతపనులైనా కావచ్చు, బాబా పనులైనా కావచ్చు.

పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ శిరిడీ సాయినాథుని వద్ద దివ్యానుభూతిని పొందిన తరువాత అట్టి స్థితిని ప్రసాదించిన శ్రీ సాయినాథుని తమ గురువుగా ఎంచుకున్నారు. అప్పటినుంచి బాబాను గురించి ఇంకా ఇంకా తెలుసుకోవాలన్న తపనతో ప్రతి శని, ఆదివారాల్లోనూ, ఇతర సెలవు దినాలలోనూ శిరిడీకి వెళ్ళేవారు. బాబా దర్శనార్థం శిరిడీకి వచ్చే భక్తులను వారి వారి అనుభవాలను గురించి అడిగి తెలుసుకునేవారు. ఎన్నో సంవత్సరాలుగా శిరిడీలో సాయి సేవలో నిమగ్నమై వున్న శ్రీ శివనేశన్ స్వామి వారిని అడిగి బాబా గూర్చిన ఎన్నో విషయాలను సేకరించారు. బాబా సశరీరులై వున్నప్పుడు వారిని ప్రత్యక్షంగా సేవించిన స్థానిక భక్తులకు సాయిబాబాతో గల అనుబంధాన్ని గూర్చి వారి పిల్లలను అడిగి ఎన్నో విషయాలను తెలుసుకున్నారు.

అంతేకాదు, సాయి దేహధారులై వున్నప్పుడు వారిని సేవించిన భక్తుల కుటుంబాలు ఎక్కడెక్కడ వున్నాయోనని విచారించి ఆయన ఆయా ప్రదేశాలకు వెళ్ళి వారి వారసులవద్ద బాబాగూర్చి తెలుసుకునే వారు. అలా చేయడంలో ఆయన ఎన్నో వ్యయప్రయాసలకోర్చారు. సాయిబాబాను ప్రత్యక్షంగా సేవించిన ఒక వృద్ధుని కలుసుకోడానికి ఆయన వున్న వూరికి వెళ్ళినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు మూడు రోజులు ఉపవసింపవలసి వచ్చిందట. అయినప్పటికీ ఆయన ఏమీ

చలించలేదు. చివరకు ఆ వయో వృద్ధుని కలుసుకొని బాబా గూర్చిన విశేషాలను సేకరించారు. ఆయన అంత శ్రమ పడడానికి కారణం తమ గురువును గూర్చి యింకా యింకా తెలుసుకోవాలన్న ఆకాంక్ష.

శ్రీ సాయినాథుని సన్నిధిలో అంతులేని ఆత్మానందాన్ని అనుభవించిన పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆయనను సశరీరులుగా దర్శించలేకపోయాననని బాధ కలిగింది. అందుకని అంతటి గొప్ప మహాత్ములు ఉన్నారేమోనని, వారి దర్శనమైనా అనుగ్రహించమనీ శ్రీ సాయిబాబాను ప్రార్థించారు. అప్పటి నుంచి అంతటి మహాత్ములకోసం అన్వేషించి ఎంతోమందిని దర్శించారు. అట్టి మహాత్ములందరూ కూడా పూజ్యశ్రీ మాస్టరుగారిని విశేషంగా అనుగ్రహించారు. ఈ వివరాలన్నీ 'నేను దర్శించిన మహాత్ములు' అన్న పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలలో చూడవచ్చు.

ఆయా మహాత్ములను దర్శించడానికై ఆయన ఎన్నో ప్రదేశాలకు వెళ్ళేవారు. ఎంతగానో వ్యయప్రయాసలకోర్చారు. ఒకసారి ఆయన ఒక మహాత్ముని దర్శనానికై బస్సులో ప్రయాణం చేస్తున్నారు. ఆ వాహనాన్ని అందుకునే ప్రయత్నంలో ఆయన ఉదయం ఉపాహారం తీసుకోలేక పోయారు. ఆకలి లేని కారణంగా ఆ క్రిందటి రాత్రికూడా ఆయన భోజనం చేయలేదు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో దారి మధ్యలో ఒకచోట బస్సు ఆగిపోయింది. అప్పుడప్పుడే బస్సు కదిలే సూచనలేవీ కనిపించలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారికి విపరీతంగా ఆకలి వేస్తున్నది. భోజనం దొరుకుతుందేమోనని ప్రక్కన కనిపించిన పల్లెటూరికి నడిచి వెళ్ళారు. ఆ ఊరిలో ఒకే ఒక్క చిన్న హోటల్ కనిపించింది. వెళ్ళి విచారించగా హోటల్ యజమాని భోజనం లేదన్నాడు. మరేదైనా వుంటే వడ్డించమని పూజ్యశ్రీ మాస్టరుగారు అతనిని అడిగారు. అతను యింకేమీ కూడా లేవన్నాడు. తమకు బాగా ఆకలి వేస్తున్నదని, కొంచెమైనా యింకేదైనా వుంటే పెట్టమనీ పూజ్యశ్రీ మాస్టరుగారు అడిగారు. అతనికి మాస్టరుగారి పరిస్థితి చూసి జాలివేసి క్రిందటి రాత్రి మిగిలిపోయిన అన్నం కొంచెం వున్నదని చెప్పాడు. "ఏమీ ఫరవాలేదు, దానినే వడ్డించు!" అన్నారాయన. అతను అలాగే చేశాడు. తీరా చూస్తే ఆ అన్నం పాడైపోయి వుంది. పైగా దానిలో పురుగులు కూడా కనిపించాయి. పూజ్యశ్రీ మాస్టరుగారు దుర్వాసనతో ఉన్న అన్నంలో పురుగులు ఏరివేసి నిర్వికారంగా స్వీకరించారు!

అలాగే నైమిశారణ్యంలో విడిది చేసిన శ్రీ ఆనందమయి అమ్మ దర్శనం కోసం వెళ్ళినప్పుడు ఎనిమిది మైళ్ళు నడువవలసి వచ్చింది. అక్కడికి వెళ్ళాక కూడా టీ, బిస్కెట్లతో ఆకలి తీర్చుకోవలసి వచ్చింది. గడ్డకట్టే చలిలో ఏ ఆచ్ఛాదనా లేకుండా రాత్రంతా గడుపవలసి వచ్చింది. అమ్మ దర్శనార్థం వెళ్ళినప్పుడు పడిన ఇబ్బందుల గురించి ఆయన చెబుతుంటే బాధ వేస్తుంది. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు మాత్రం అమ్మను దర్శించినప్పటి విషయాలు ఆనందం ప్రస్ఫుటమవుతుంటే ఎంతో ఉత్సాహంతో చెప్పేవారు. అలాగే శ్రీ రాఖాడీ బాబా దర్శనానికి వెళ్ళినప్పుడు ఆయన కొన్ని మైళ్ళు నడువవలసి వచ్చింది.

అంతేకాదు, ఆయన ఇతర మతాలకు చెందిన మహాత్ములను గూర్చి తెలుసుకోవాలన్న ఆకాంక్షతో ఇతర మతాలలోని ఎంతోమంది మహాత్ముల చరిత్రలు చదివారు. అలాగే వైజ్ఞానిక శాస్త్రవేత్తలు ఈ సృష్టి గురించి ఏమి చెప్పారోనని, వారు చెప్పినదానికి, ఆధ్యాత్మికతకు సంబంధం వున్నదేమోననే జిజ్ఞాసతో వైజ్ఞానిక శాస్త్రవేత్తలు రచించిన ఎన్నో గ్రంథాలను చదివారు. ఆయన తమ విధులను నిర్వర్తిస్తూనే లక్షల గ్రంథాలను చదివారంటే అతిశయోక్తి కాదు.

సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని గూర్చి తెలుసుకోవడమేగాక తమకు లభించిన శ్రేయస్సును అందరూ పొందాలనే ఆకాంక్షతో తమకు తెలిసినవారందరికీ సాయిబాబా మహాత్మ్యం గూర్చి చెప్పసాగారు. ఆయన చెప్పిన విషయాలకు ప్రభావితులై ఎందరో ఆయన వద్దకు వచ్చి బాబా గూర్చి తెలుసుకొనేవారు. పిల్లలు – పెద్దలు, స్త్రీలు – పురుషులు, నిరక్షరాస్యులు – ఉన్నత విద్యాధికులు ఎవరు వచ్చినా వారి వారి స్థాయికి తగినట్లు బాబా గూర్చి వివరించి చెప్పేవారు. తరువాత ఆయనను ఎంతోమంది బాబా గూర్చి ప్రవచించమని ఆహ్వానించసాగారు. ఎవరు ఎక్కడకు పిలిచినా వెంటనే సంతోషంతో ఆయన అంగీకరించేవారు. అలా ఆహ్వానించినవారు తమకు ఎటువంటి ప్రయాణ సౌకర్యాలు గాని, వసతులు గాని ఏర్పరచకపోయినప్పటికీ ఆయన అవేవీ పట్టించుకునేవారు కాదు. తమ గురువు

గూర్చి పదిమందికి తెలియజెప్పాలని సంకల్పించారు గనుక ఆ కార్యదీక్షలో ఎవరి సహాయమూ అర్థించడం గాని, అసౌకర్యాలను పట్టించుకోవడంగానీ చేసేవారు కాదు. ఆయన ఎన్నోసార్లు సాధారణ రైలుబోగీలో కూర్చోడానికి అవకాశం లేకపోయినా, క్రిక్కిరిసిన జనం మధ్య కూర్చోడానికి కూడా చోటులేక నిలబడే ప్రయాణం చేసేవారు. కొన్నిచోట్లకు నడిచి వెళ్ళారు, మరికొన్ని చోట్లకు సైకిలు మీద, రిక్షాల మీద, స్కూటర్ మీద కూడా ప్రయాణించిన సందర్భాలు కూడా వున్నాయి.

సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగాలు చేస్తున్న సమయంలో ఆంధ్రదేశంలో సాయిబాబా గూర్చి పెద్దగా తెలియదు. అందులోనూ సాయిబాబా అంటే ముస్లిం మహాత్ముడనే సంశయం కూడా చాలామందికి కలిగేది. ఆయన మహిమల గూర్చి విన్నవారు కొందరు, ఆయనను కూడా ఏదో గారడీ చేసే వ్యక్తిగానే - అంటే కపట సాధువుగానే తలచేవారు. అటువంటి పరిస్థితులలో పూజ్యశ్రీ మాస్టరుగారు బాబాను గూర్చి ప్రచారం చేయడానికి ఎంతో వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్నో విమర్శలు కూడా ఆయన ఎదుర్కొన్నారు. కానీ తాము ఎంతగానో నమ్మిన గురువు ఔన్నత్యం గూర్చి ప్రపంచానికి ఎరుకపరచడానికి ఆయన ఏమాత్రం వెనుకంజ వేయలేదు. కలిపురుషుని వికృత వైఖరి విజృంభిస్తూ ధర్మభ్రష్టత పెచ్చు పెరుగుతున్న ఈ రోజుల్లో ఆయన అందుకు విరుగుడుగా సాయి మహాత్మ్యాన్ని గూర్చి ప్రచారం చెయ్యడం ఒక్కటే అత్యంత బలీయమైన సాధనమని తలచారు. అందుకని ఈ ప్రచారయజ్ఞాన్ని అత్యంత దీక్షతో ఆయన కొనసాగించారు. నాస్తికులు ఈయన పద్ధతిని వ్యతిరేకించి ఆయనతో వాదప్రతివాదనలు జరిపారు. కానీ నిర్దుష్టమైన ధర్మసాధనమైన భగవత్తత్త్వాన్ని, సాయి తత్త్వాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారు నిరూపించినదానికి వారు నిలబడలేకపోయారు. కొందరు ఆస్తికులు కూడా శ్రీ సాయిబాబా మహాత్ముడు కాదని, ఆయనను ఆరాధించడం అవివేకమని విమర్శించేవారు. తమ దగ్గర యిట్టి అభిప్రాయాలు వెలిబుచ్చినవారికి ఆయన శ్రీసాయిబాబా యొక్క ఔన్నత్యాన్ని గూర్చి తెలియజెప్పేవారు. ఆయన ద్వారా బాబా లీలలను, తత్త్వాన్ని తెలుసుకొని వారందరూ సాయి భక్తులు అయ్యేవారు. ఆయన వెనుకగా విమర్శించిన వారి మాటలను ఆయన పట్టించుకునేవారు కాదు.

ప్రారంభంలో ఆయన చేసే సత్సంగాలకు గాని, ఉపన్యాసాలకు గాని ఎక్కువమంది వచ్చేవారు కాదు. కానీ క్రమక్రమంగా సంఖ్య పెరిగి ఆయన ఉపన్యాసాలకోసం ఎంతోమంది ఎదురుచూచేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఊపిరి సలపనంతగా తమ గురువైన సాయినాథుని గూర్చి తెలియజేస్తూ జీవితాంతం తమ ప్రచారోద్యమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. ఆయన అవిరామకృషి ఫలితంగా నేడు ఊరూరా, వాడవాడలా, దేశ విదేశాలలోనూ కూడా ఎన్నో కోట్ల మంది సాయిభక్తులై శ్రీ సాయిబాబాను తమ సర్వస్వంగా భావిస్తున్నారు. విశేషంగా ఆరాధిస్తున్నారు. ఎన్నోచోట్ల బాబా మందిరాలు నిర్మించబడ్డాయి.

మొదటి నుండి ఆయన తత్త్వం అటువంటిదే. యమ్.ఎ. చదవాలని ఆయన సంకల్పించినప్పుడు డబ్బులు లేకపోయినా కేవలం రెండు జతల బట్టలతోనూ, కాళ్ళకు చెప్పులు లేకుండానూ, పుస్తకాలు లేకుండానూ కూడా ఆయన తమ చదువును పూర్తిచేశారు. అలాగే ఐ.ఎ.ఎస్. చదువు తనకు ఇష్టం లేదని చెప్పినప్పుడు వారి రెండవ అన్నగారు "నువ్వు చదవలేవని అలా అంటున్నావు. నిజంగా నువ్వు పూర్తిచేయగలిగితే, ఆ పరీక్షలో ఉత్తీర్ణుడవై నిరూపించు", అన్న సవాలు ఎదుర్కొని కేవలం రెండు నెలల సమయంలోనే చదివి, ఆ పరీక్షలో ఉత్తీర్ణులై, ఆ పదవి లభించినా ఏ మాత్రం సంకోచించకుండా పరిత్యజించారు.

పైన చెప్పుకున్న విషయాలను గమనిస్తే ఆయన కార్యదీక్ష ఎంతటిదో మనకు అవగతమౌతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారిని మానవుడిగానే చూసినట్లయితే ఆయన అవిరామ కార్యదీక్షాదక్షుడు, అవిశ్రాంత పరిశ్రామికుడు, మహామనీషి.

ఆయనను ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే ఆయన మహామహిమాన్వితులు, మహాత్ములు!

అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారిని గూర్చి గొప్ప మహాత్ములు 'సాయిబాబా కా బేటా' అని, 'భరద్వాజ్ భగవాన్ హై' అని ఇంకా ఎన్నో విధాల ఆయనను ప్రశంసించారు.

అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదినం యావత్ సృష్టికే శుభోదయము, శుభప్రదము. ●

# పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి తృతీయ ఆరాధనా మహోత్సవము

**శ్రీమతి టి.పద్మావతి**

ఒంగోలుకు సమీపంలో గుమ్మళంపాడు గ్రామ శివారులో, 'శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము' లో పూజ్యశ్రీ అమ్మగారి తృతీయ ఆరాధన మహోత్సవం జూన్ 3, 2024 న అద్భుతంగా జరిగింది. వాస్తవానికి తిథి ప్రకారం మే 31, తేదీల ప్రకారము జూన్ 3 అవటం వలన వేడుకలు మే నెల 31న ప్రారంభమై జూన్ 3 తేదీ వరకు కొనసాగాయి. చుట్టుపక్కల పట్టణాలు, పల్లెల నుంచి భక్తులు తండోపతండాలుగా పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి విచ్చేసారు. పూజ్యశ్రీ బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్లకు అలంకరణ కన్నుల పండుగగా జరిగింది.

జూన్ మూడవ తేదీ ఉదయం ఐదున్నర గంటలకు మేలుకొలుపు సేవతో ఉత్సవం మొదలైంది. ఆరు గంటలకి కాకడ హారతి, అనంతరం ముగ్గురు మూర్తులకు కాఫీ ప్రసాదం నివేదన జరిగాయి. అటుతర్వాత పూజ్యశ్రీ అమ్మగారికి మంగళ స్నానాలు ప్రారంభమయ్యాయి. పసుపు, కుంకుమ, గంధము మరియు ఇతర సుగంధ ద్రవ్యాలు, తులసి, మారేడు దళములు, నదీ, సముద్ర జలాలతో మాతృదేవికి విశేష అభిషేకం జరిగింది. తర్వాత అల్పాహార నివేదన, అనంతరం ప్రత్యేక పూలతో సమాధిపై పూజ్యశ్రీ అమ్మగారి మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సుమారు 10 గంటల సమయానికి గురుదంపతుల ప్రియపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు సతీసమేతులై పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి విశేష పూజ గావించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందం అంతా ఈ పూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం శ్రీ ద్వారకానాథ్ జ్ఞానేశ్వర్ గారు సత్సంగం చేశారు. అందులో కొన్నింటిని ఇక్కడ ప్రస్తుతించుకుందాం.

"ఈ పరమ పవిత్రమైన రోజున పూజ్యశ్రీ అమ్మగారిని హృదయపూర్వకంగా స్మరిస్తున్న వాళ్ళందరికీ ఇహపర శ్రేయస్సు చేకూర్చే విధంగా జీవితాన్ని నడపమని, దత్తస్వామి, బాబా, మాస్టరుగారు, మనందరం ఎలా జీవిస్తే మెచ్చుకుంటారో అటువంటి సామర్థ్యాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తున్నాను" అంటూ వారి సత్సంగాన్ని మొదలుపెట్టారు.

"కొన్ని సంవత్సరాల క్రితం ఏ శరీరంతో ఈ భూమి మీద అవతరించి ఈ విశ్వాన్ని పునీతం చేశారో, అటువంటి తమ శరీరాన్ని మూడు సంవత్సరముల క్రితం భక్తులందరూ ఆరాధించుకోవడానికి వీలుగా మనకి అంకితం చేసి వెళ్లారు పూజ్యశ్రీ అమ్మగారు. మహా తపస్వులైనవారు ఒక శిలకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తే, ఆ రూపంలో వున్న భగవంతుడు భక్తుల కోరికలను తీరుస్తూ వుంటాడు. అయితే నిరంతరం తమ ప్రాణమే భగవత్స్వరూపంగా ఏర్పరచుకున్న మహనీయుల దగ్గరకు భగవంతుడే వచ్చి వీళ్ల ద్వారా పనిచేస్తుంటారు. వాళ్ళు సాక్షాత్ భగవత్స్వరూపులు అవుతారు. అటువంటి వారి శరీరాలు అన్ని క్షేత్రాల కంటే పరమ పవిత్రమైనవి. నేనూ, ఈ చూసే మొత్తంలో, ప్రాణశక్తిగా పనిచేస్తున్నది పూజ్యశ్రీ అమ్మగారు. వారు నిత్య సత్యులు కనుక వారి శరీరాన్ని మామూలు శరీరంగా కాకుండా భగవంతుడి ప్రతీకగా మనం పూజించుకుంటున్నాం. అందుకే వారికి పూజ, ప్రార్థన, సేవ, ధ్యానం, చేసుకోవడం అరుదైన అవకాశం. వారి సన్నిధిలో ఇవి చేసుకుంటూ, అంతటా ఒకటే వున్నది అన్న ప్రయత్నం ప్రతి ఒక్కరు చేయాల్సి వుంది. కానీ మన మనసు దానికి

వ్యతిరేకంగా ప్రయాణం చేస్తూ వుంటుంది. అటువంటి బలహీనమైన మనసుని అంతటా ఒకటే వుంది అన్న అనుభూతిలోనికి తీసుకువెళ్లే ప్రయాణం పేరు ఆధ్యాత్మికత. అందరిలో భగవంతుడు వున్నాడు అన్న భావాన్ని చిన్నప్పటినుంచి అందరూ చెప్పుకుంటూ వుండాలి. ఇలా జీవితం మొత్తాన్ని శిక్షణతో నడుపుకోవడమే సాంప్రదాయం అంటారు. దీన్ని నేర్పించే వాళ్ళను గురువులు అంటారు. ఇలా సాధన చేస్తూ వుంటే ఎన్నో కష్ట నష్టాలు రావచ్చు, అప్పుడు 'వారికే' ప్రార్థన చేసుకుంటూ, మనసును పదును పెట్టుకుంటూ ముందుకు వెళ్లాలి. ఇలా ప్రయత్నం చేసే వాడికి మాత్రమే ఏ సాధనైనా చివరికి మంత్రసాధనైనా కూడా ఫలిస్తుంది. అలా ప్రయత్నం చేయని వాడికి ఏ సాధనా ఫలించదు. జీవితం బాగుపడడానికి ఇదొక్కటే మార్గం. మరి అలా బ్రతకగలమా అంటే బ్రతకగలము అని పూజ్యశ్రీ అమ్మగారు బ్రతికి చూపించారు. ఇది మనకి అవగాహన లోకి రావాలంటే ఇలాంటి మహాత్ముల చరిత్రలు చదవాలి. మనకు వచ్చే సంఘటనలన్నింటిలో ఏ విధంగా ప్రవర్తించాలి అన్నది వాళ్ల జీవితం నిరూపిస్తుంది. ఇలాంటి ప్రయత్నం చేయడమే పూజ్యశ్రీ అమ్మగారికి యిష్టం. అందువల్ల ఇటువంటి సన్మార్గంలో మనందరం ముందుకు వెళ్లాలని, అలా ముందుకు వెళ్ళడానికి వారి అనుగ్రహం అవసరమని, అందుకని మనందరినీ అనుగ్రహించమని ఈ ఆరాధన సందర్భంగా వారిని ప్రార్థిస్తున్నాను" అని చెప్పి వారి సత్సంగాన్ని ముగించారు.

"పూజ్యశ్రీ అమ్మగారు 2021 జూన్ మూడో తేదీన మధ్యాహ్నం గం1-12ని.కు, విశ్వవ్యాప్తమయ్యారు. కనుక ఈరోజు ఆ సమయంలో ప్రత్యేక హారతి వుంటుంది. అంతవరకు శ్రీమతి వేదమ్మ ప్రసంగిస్తారు" అని చివరలో గురుపుత్రులు తెలియజేశారు. తర్వాత శ్రీమతి వేదమ్మగారు సత్సంగం ప్రారంభించారు. అందులో కొన్ని విశేషాలు,,,,

"పూజ్యశ్రీ అమ్మగారు ఇటువంటి ప్రత్యేక సందర్భాల్లో ముందు నుంచే మనసుకి తర్ఫీదును ఇచ్చేవారు. అంటే, విజయదశమి గాని పూజ్యశ్రీ మాస్టరు గారి ఆరాధన కానీ వచ్చినప్పుడు, ముందు నుంచి వారి చరిత్ర పారాయణ చేయించేవారు. అలా చేయడం వల్ల ఆరోజు జరిగే కార్యక్రమంలో భక్తిగా పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పేవారు. ఈరోజు ఇక్కడ ఎంతో చక్కటి ఏర్పాట్లు జరిగాయి. ఎక్కడెక్కడి పువ్వులో అమ్మగారి సేవ కోసం అలంకరింపబడ్డాయి. అలాగే ఎక్కడెక్కడ నుంచో అందరూ అమ్మగారు సన్నిధిని అనుభవించడానికి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఇప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు చేసిన లీల తప్పకుండా స్మరించుకోవాలి. రెండు మూడు రోజుల క్రితం ఇక్కడున్న వాళ్ళకి ఇక్కడ పరిస్థితి బాగా తెలుసు. విపరీతమైన వేడి. అదే పరిస్థితి కొనసాగితే, ఈరోజు ఇలా కూర్చుని మాట్లాడుకునే అవకాశం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మనం అనుభవిస్తున్న పరిస్థితి చూస్తే, మొత్తం వాతావరణం అంతా నిన్న సాయంత్రానికి చల్లబరిచి, మనకి ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చారు. అసలు ఇది ఎంత గొప్ప లీల! అంటే ప్రకృతిని నియంత్రించే లీల! వారు ఇంత లీల ఈవేళ ఎందుకు చేశారు అని మనం ఆలోచించుకోవాలి. మనం ఒక అడుగు వేస్తే వాళ్ళు పది అడుగులు వేస్తారు అన్న నిరూపణకి సంబంధించిన లీలని నాకు అనిపిస్తుంది. ఈనాటికీ అంటే శరీరంతో లేకపోయినప్పటికీ మనకి శ్రేయస్సు చేకూరుస్తూనే వున్నారు. ఈ పవిత్రమైనటువంటి రోజున మనం సరైన దృక్పథంతో ఉండడానికి ఏం స్మరించుకుంటే బాగుంటుంది అని ఆలోచిస్తే, దత్త స్వామి అవతరించినప్పటినుంచి, బాబా, మాస్టరుగారు, అమ్మగారు వరకు జరిగినదంతా స్మరించుకుంటే ఇదంతా గొప్ప లీల అనిపిస్తుంది. పూజ్యశ్రీ అమ్మగారు కానీ, పూజ్యశ్రీ మాస్టరుగారు కానీ చేసిన లీలలు చాలామంది మహాత్ముల చరిత్రలో చూసినట్లయితే ఇంచుమించు ఒకే లాగా ఉంటాయి. ఎందుకంటే వారందరితత్త్వం ఒకటే కనుక! పైగా వారి జీవితాలు సామాన్యుల జీవితాలకి భిన్నంగా ఉంటాయి. ఈరోజు ఆరాధన మహోత్సవం జరుపుకుంటున్న పూజ్యశ్రీ అమ్మగారి జీవిత విధానం గమనిస్తే,,, అమ్మగారికి చిన్నప్పటినుంచి 'ఇది కావాలి' అనే కోరిక వుండేది కాదట, 'ఎప్పుడూ భగవంతుడు కృప కావాలి' అనే ఒక్క కోరిక మాత్రమే వుండేదిట. అందువల్ల ఎక్కువ స్మరణలో వుండేవారు. చాలా తక్కువగా మాట్లాడేవారు. మాట్లాడటం వల్ల స్మరణకి అంతరాయం కలుగుతుందని పూజ్యశ్రీ అమ్మగారి ఉద్దేశ్యం. ఆవిడ చిన్న వయసు నుంచి, చివరికి ఆసుపత్రిలో మంచం మీద వున్నప్పటి వరకూ కూడా స్మరణ జరుగుతూనే వుండేది. ఆ రకంగా స్మరణలో వుండడంవల్ల ఆమె జీవితమంతా కూడా ఆధ్యాత్మిక మార్గంలోనే నడిచింది. పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి వచ్చేటప్పటికే పూజ్యశ్రీ అమ్మగారు పూర్తిగా భగవత్ చింతనలో వుండేవారు. వారు తమ జీవితాన్ని సమతౌల్యంతో

***మిగతా 13వ పేజీలో***

# మాతృదేవి స్మృతులు

## శ్రీమతి రేవతి

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని భువనేశ్వర్ వాస్తవ్యురాలు శ్రీమతి రేవతిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు–

మొట్టమొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని 2002లో చిక్కడపల్లిలో దర్శించుకున్నాను. ఒకరోజు సాయంత్రం సత్సంగానికి పూజ్యశ్రీ అమ్మగారి నిలయానికి వెళ్ళాము. పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్ని 'ఎక్కడనుంచి వచ్చా' రని అడిగారు. మేము భోన్ గిరి, ఒరిస్సానుంచి వచ్చామని చెప్పాను. వారు మాకు ఊదీ పెట్టి, పళ్ళు ప్రసాదంగా యిచ్చి పంపించారు. అప్పటినుంచి నేను హైదరాబాదులో వున్న మా తమ్ముడి ఇంటికి వచ్చినప్పుడల్లా పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకునేదాన్ని.

మాకు ఒక అబ్బాయి. మావారు, నేను, మా అబ్బాయి.. అందరం పారాయణ చేస్తాము. ఒకసారి మా బాబుకి కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చాయి. అప్పట్లో పూజ్యశ్రీ అమ్మగారితో ఫోనులో మాట్లాడే అవకాశం వుండేది. నేను మా బాబు విషయం పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పాను. అప్పుడు వారు, "ఇది ఫోన్ లో చెప్పడం కాదు, నువ్వొకసారి ఇక్కడికి రామ్మా!" అన్నారు. ఆ రోజుల్లో పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరిలో వున్నారు. నేను ఇంటిదగ్గర బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించుకుని, 'నాకు పూజ్యశ్రీ అమ్మగారి చేతులమీదుగా పండు కాకుండా ఏదైనా వండిన ప్రసాదం లభించాలి. నాకు ఎప్పటికీ గుర్తుండే కానుక ప్రసాదించాలి!' అని ప్రార్థించి దర్శనానికి వెళ్ళాను.

నేను పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళేటప్పుడు 'శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు' గ్రంథం కొని తీసుకెళ్ళాను. లోపలకు వెళ్ళగానే పూజ్యశ్రీ అమ్మగారు ఒక కప్పులో పాయసం ప్రసాదంగా యిచ్చారు. అలా నేను కోరుకున్న వండిన ప్రసాదం పూజ్యశ్రీ అమ్మగారే స్వయంగా నాకు ప్రసాదించారు!! నాకు చాలా సంతోషం కలిగింది. తరువాత పూజ్యశ్రీ అమ్మగారు నాకు వచ్చిన సమస్య గురించి వివరంగా అడిగి పారాయణలు, ప్రదక్షిణలు, కొన్ని సూచనలు, సలహాలు చెప్పారు. నేను పూజ్యశ్రీ అమ్మగారితో, "ఈమధ్య నా చుట్టుపక్కలంతా లౌకికంగా వున్నవాళ్లు ఎక్కువగా వుండడం వల్ల బాబా మీద మనసు నిలవడం లేదమ్మా!" అని చెప్పాను. అప్పుడు వారు, "పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన 'ప్రవచనాలు' గ్రంథం చదువు!" అన్నారు! నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. 'ముందే నాచేత కొనిపించారన్నమాట!' అనుకున్నాను. ఇంకా అద్భుతం!! వారు నాకు శిరిడీ నుండి వచ్చిన బాబా వస్త్రాన్ని ప్రసాదంగా ఇచ్చారు! అది నాకు ఎప్పటికీ గుర్తుండే అమూల్యమైన కానుక! అలా నా కోరికలన్నీ తీర్చారు పూజ్యశ్రీ అమ్మగారు. నా ఆనందానికి, ఆశ్చర్యానికీ అవధులు లేవు. భారం దిగిపోయిన మనస్సుతో, హాయిగా పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులు తీసుకుని బయటకు వచ్చాను. వస్తూనే అక్కడివారిని, "ఈరోజు పాయసం ఎందుకు చేశారు?" అనడిగాను. "ఈరోజు పూజ్యశ్రీ అమ్మగారు, 'పాయసం వండండి! పంచాలి' అని చెప్పారు. అందుకే వండాము" అన్నారు! ఇది నేను మొట్టమొదట పూజ్యశ్రీ అమ్మగారినుంచి పొందిన అనుభవం.

ఒకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారికి పాదసేవ చేసుకుంటున్నాను. వారిని, "మాస్టరుగారూ! ధ్యానం ఎలా చేసుకోవాలండీ?" అని అడిగాను. పక్కనే పూజ్యశ్రీ అమ్మగారు ఆకుపచ్చటి చీర కట్టుకుని పడుకుని వున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమీ మాట్లాడకుండా లేచి వెళ్లిపోయారు.

నేను పక్కనే వున్న పూజ్యశ్రీ అమ్మగారికి పాదసేవ చేయడం మొదలుపెట్టాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు మళ్ళీ వచ్చి నన్ను మెచ్చుకున్నట్టు చూస్తూ, "ఇది చాలు, ఇక ఏ ధ్యానం అక్కరలేదు!" అని చెప్పారు. అంటే పూజ్యశ్రీ అమ్మగారికి సేవ చేస్తే ధ్యానం చేసినట్లేనని పూజ్యశ్రీ మాస్టరుగారు స్పష్టం చేసారన్నమాట! అంతేకాదు, పూజ్యశ్రీ మాస్టరుగారు, నాకు పూజ్యశ్రీ అమ్మగారిని ఆశ్రయించమని చెప్పినట్లు అనిపించింది. అనిపించడం కాదు, నిజమే! ఎందుకంటే వారి సమక్షంలోను, పరోక్షంగా కూడా పూజ్యశ్రీ అమ్మగారి ప్రేమను, అనుగ్రహాన్ని నేను ఎంతగానో పొందాను, పొందుతున్నాను.

నాకు ప్రతి సంవత్సరం పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదినం సందర్భంగా ఒకరిని బాబాగాను, మరొకరిని పూజ్యశ్రీ మాస్టరుగారిగాను భావించి ఇద్దరు వ్యక్తులకు భోజనం పెట్టడం అలవాటు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదినం రోజున అలా భోజనం పెట్టడం మర్చిపోయాను. అందుకు నేను చాలా బాధపడ్డాను. ఒకరోజున స్వప్నంలో పూజ్యశ్రీ అమ్మగారు మా ఇంటికి వచ్చి రెండు కుర్చీలు, రెండు బల్లలు ఒక దానిమీద ఒకటి వేసుకుని కూర్చుని, "ఏమిటీ.. భోజనం పెట్టలేదని బాధపడుతున్నావ్? ఇప్పుడు పెట్టు!" అన్నారు. నాకు ఆనందంతో మాట రావడం లేదు. "అమ్మా! పొంగలి చేసి పెట్టమంటారా?" అనడిగాను.

"ఏమిటీ, పొంగలా! ఏం తొందరగా అయిపోతుందనా?" అన్నారు. "అయితే ఆలూ పరాఠా చేయమంటారా అమ్మా?" అంటే, "సరే!" అన్నారు. మెలకువ వచ్చేసింది.

నేను 2014 డిసెంబర్ 31 రాత్రి నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్లాను. నేను పూజ్యశ్రీ అమ్మగారికి, అక్కడి సేవకులందరికీ ఆలూ పరాఠా, ఇంకొన్ని వస్తువులు తీసుకుని దర్శనానికి వెళ్లాను. ఆరోజు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం అద్భుతంగా జరిగింది. పూజ్యశ్రీ అమ్మగారికి వేసిన మాల చాలా అందంగా వున్నది. అది గులాబీ రేకులతో చేస్తారట. ఇదివరకు నేనెప్పుడూ చూడలేదు. పూజ్యశ్రీ అమ్మగారికి వేస్తే ఎంతో బాగుంది. సత్సంగం అయిపోయి అందరం బయటకు వచ్చాక, "ఇక్కడ రూర్కెలానుంచి వచ్చిన రేవతిగారు ఎవరు?" అని సులోచనగారు అడిగారు. నేనేనని చెప్తే, ఈ మాల మీకు పూజ్యశ్రీ అమ్మగారు ఇమ్మన్నారని, పూజ్యశ్రీ అమ్మగారి మెడలో వేసిన మాల అని నాకు ఇచ్చారు!! నేను చాలా ఆశ్చర్యపోయాను. నా మనసులోని ఆలోచనను సైతం తెలిసికొని వెంటనే ఆ మాలను నాకు ప్రసాదంగా పంపించిన పూజ్యశ్రీ అమ్మగారి సర్వజ్ఞత్వానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది?

అలాగే నన్ను, పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ ద్వారక బాబుగారిని ఒకసారి కలిసి వెళ్ళమని చెప్పారట. అప్పుడు అక్కడ బాబుగారు నిలయం బయట ఎవరితోనో మాట్లాడుతున్నారు. 'జై సాయి మాస్టర్!' అని చెప్పి, నన్ను నేను పరిచయం చేసుకున్నాను. "ఏమీ లేదండి--- పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలన్నింటినీ మిమ్మల్ని ఒరియా భాషలోకి అనువదించమని పూజ్యశ్రీ అమ్మగారు చెప్పారు" అన్నారు! అప్పుడు అక్కడ గుత్తి శ్రీనివాస్ గారు కూడా వున్నారు. ఒక్కసారి 'అమ్మ బాబోయ్! నేనేం వ్రాయగలను?' అని మనసులో అనుకున్నాను. కానీ పైకి సరేనని చెప్పి వచ్చేశాను.

పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం తరువాత ఆరు నెలల వరకూ నేను ఏమీ వ్రాయలేదు. ఒకరోజు గుత్తి శ్రీనివాసుగారు ఫోన్ చేసి, "అనువాదం మొదలుపెట్టారా?" అనడిగారు. ఇక తప్పేటట్లు లేదని ముందుగా శ్రీగురుచరిత్ర ఏకాహం చేసుకుని తరవాత తర్జుమా మొదలుపెట్టాను. నాకు ఒరియా మాట్లాడటమే కానీ, అంతగా చదవడం, వ్రాయడం రాదు. కానీ నెమ్మదిగా నేర్చుకుని ఆ యజ్ఞం మొదలుపెట్టాను. పూజ్యశ్రీ అమ్మగారు దయతో నా చేత ఈ సేవ చేయించుకోవడం నా భాగ్యం. వారి అనుగ్రహంతో ఇప్పటివరకు శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిసన్నిధి గ్రంథాలు అనువదించగలిగాను.

ఒకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు నాకొక మంత్రం చెప్పారు. దాంట్లో నాలుగు వరుసలు వున్నాయి. మెలకువ వచ్చాక మూడు వరుసలే గుర్తున్నాయి. నాలుగవ వరుస ఎంత ప్రయత్నించినా గుర్తురాలేదు. ఒకసారి నాగోల్ లో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళినప్పుడు ఈవిషయం చెప్తే, వారు నాలుగవ వరుస వ్రాసి పూర్తిచేశారు!! "ఎంతసేపు జపం చేయాలమ్మా?" అనడిగాను. "నీకు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పలేదా?" అనడిగారు. "చెప్పలేదమ్మా!" అన్నాను. అయితే, "నీకు ఎంతసేపు వీలైతే అంతసేపు చేసుకో!" అన్నారు.

ఒకసారి కొడైకెనాల్ వెళ్ళినప్పుడు అక్కడ అకస్మాత్తుగా మోకాళ్ళు పట్టేసి నొప్పులు వచ్చాయి. ఇంటికి వచ్చాక డాక్టర్

దగ్గరకి వెళితే, ఇవి తగ్గే నొప్పులు కావు, ఉపశమనానికి ఏదైనా వాడుకోవలసిందేనని చెప్పారు. నాకు చాలా బాధ కలిగింది. పారాయణ కూడా కుర్చీలో కూర్చుని చేసుకోవలసిన పరిస్థితి. 'ఇక నా పరిస్థితి ఇంతేనా?!' అని చాలా బాధపడేదాన్ని. ఒకరోజు నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర కొంతమంది కూర్చుని వున్నారు. వాళ్ళతో పాటు నేనూ కూర్చున్నాను. అక్కడ ఒక ట్రంక్ పెట్టె వుంది. పూజ్యశ్రీ అమ్మగారు దానిని అక్కడ కొంచెం దూరంలో వున్న గదిలో పెట్టమన్నారు. సరేనని పెట్టె తీసుకునేసరికి చాలా బరువుగా వుంది. పెట్టెని మోయలేక నడుస్తుంటే కాళ్లు వంగిపోతున్నాయి. బాధని భరిస్తూ కష్టపడి ఆ పెట్టెను ఆ గదిలో పెట్టి వచ్చాను. కల పూర్తయింది. మర్నాటినుంచి నాకు మోకాళ్ళు నొప్పులు లేనేలేవు. పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పటివరకూ రాలేదు. ఈ స్వప్నం వచ్చి దాదాపు మూడు సంవత్సరాలై వుంటుంది. ఇది పూజ్యశ్రీ అమ్మగారి అవ్యాజ కరుణ! వారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను?!

పూజ్యశ్రీ అమ్మగారు సమాధిచెందే ముందు నాకొక సంకల్పం కలిగింది. శ్రీ గురుచరిత్ర ఒరియాలోకి నాచేత అనువాదం చేయించారు కనుక, గురువు అనుగ్రహం తరతరాలుగా వుండాలంటే దానికి గుర్తుగా సమర్ధ సద్గురు మూర్తి అయిన పూజ్యశ్రీ అమ్మగారు దత్తపాదుకల రూపంలో మా ఇంట్లో కొలువైవుండి తరతరాలుగా మా ఇంట్లో పూజలందుకోవాలనే సంకల్పం కలిగింది. కనుక పాదుకలను తీసుకొని పూజ్యశ్రీ అమ్మగారిచేత వాటిని తాకించి పూజలో పెట్టుకుందామనుకున్నాను. కానీ కొద్దిరోజులలోనే పూజ్యశ్రీ అమ్మగారు సిద్ధిపొందారు.

వారు నిత్యసత్యులు కదా! అందుకని మండలారాధనకు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి పాదుకలను తీసుకువచ్చి ఆశీస్సులు తీసుకుందామని సంకల్పించాను. ముందుగా విద్యానగర్ లోను, గొలగమూడిలోను, తరవాత ఒంగోలు పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలోను పూజ చేయించి, పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి తీసుకువచ్చాను. అక్కడ ద్వారకబాబుగారు వాటికి పూజ చేసి నాకు అందించారు. ఈవిధంగా పూజ్యశ్రీ అమ్మగారు నా సంకల్పాన్ని నెరవేర్చారు.

ప్రతిక్షణం పూజ్యశ్రీ అమ్మగారు నాపై అనుగ్రహ వర్షం కురిపించిన సంఘటనలు చాలా వున్నాయి. నా ప్రయత్నంకంటే ఆ తల్లి అనుగ్రహమే నాకు రక్ష! నన్నే కాదు, నా కుటుంబంలోని వారందరినీ అనుగ్రహించి ఆదుకున్నారు.

ఆ తల్లి ప్రేమ, అనుగ్రహం పొందే భాగ్యాన్ని జన్మ జన్మలకు పూజ్యశ్రీ అమ్మగారే నాకు ప్రసాదించాలని త్రికరణశుద్ధిగా కోరుకుంటూ ప్రణామాలర్పిస్తున్నాను. ●

## పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి తృతీయ ఆరాధనా మహోత్సవము

10వ పేజీ తరువాయి

నడిపించారు. అంటే పిసినారితనంగా వుండకూడదు, అలాగని భారీగా ఖర్చు చేయకూడదు అనేవారు. అదేవిధంగా నిరాడంబరంగా (సింపుల్ గా) వుండాలని అనిపించుకోవడం కోసం అలా వుండకూడదు అనేవారు. సరైన వివేకం కలిగి వుండాలని చెప్పేవారు. నిత్యజీవితంలో అన్ని పనులూ నిర్వహిస్తున్నా స్మరణ మాత్రం మరిచేవారు కాదు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఇష్టపడేటట్లు పూజ్యశ్రీ అమ్మగారి జీవిత విధానం వుండేది. తమను అనన్యంగా సేవించే వారిని తమ రూపంగా చేస్తామని మహాత్ములందరూ చెప్పినట్లు, శ్రీ బాబానే తానైనట్లు పూజ్యశ్రీ మాస్టరుగారు వుంటే, పూజ్యశ్రీ మాస్టరుగారే తానైనట్లు, పూజ్యశ్రీ అమ్మగారు వుండేవారు. అందుకే బాబాని, మీకు శిష్యులు ఉన్నారా అనడిగితే పూజ్యశ్రీ మాస్టరు గారిని చూపించారు. పూజ్యశ్రీ మాస్టరుగారిని ఈ ప్రశ్న అడిగితే వారు పూజ్యశ్రీ అమ్మగారిని చూపించారు.

కానీ మనం, మనలో ఎటువంటి మార్పు తెచ్చుకోకుండా, వాళ్లకి ఇష్టమైనట్లు మలుచుకోకుండా, మన జీవితాల్లో ఆచరణ లేని ఆచారాలని అనుసరిస్తూవుంటాం. కనుక ఇప్పటినుంచి మనందరం కూడా అలా నడుస్తామని, అలా నడిపించమని, ఆ విధంగా మనల్ని అందరిని అనుగ్రహించమని పూజ్యశ్రీ అమ్మగారిని ప్రార్థిస్తున్నాను" అంటూ తమ సత్సంగాన్ని ముగించారు శ్రీమతి వేదమ్మగారు.

అప్పుడు సమయం 1గం. 12ని. అవ్వడంతో, అది పూజ్యశ్రీ అమ్మగారు విశ్వవ్యాప్తమైన సమయం కనుక శ్రీ ద్వారక బాబుగారు ప్రత్యేక హారతినిచ్చారు. భక్తులందరినీ ఒకొక్కరుగా వచ్చి పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించుకొమ్మని, తరువాత భోజన ప్రసాదం తీసుకుని వెళ్లవలసినదని విజ్ఞప్తి చేసి,,, కార్యక్రమానికి స్వస్తి పలికారు.

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

***శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.***

## 13వ ప్రసంగము

### మనస్సు వివేకం చేత జయింపబడుతుంది

మనస్సును జయించడానికి వివేకము ముఖ్యమైనది. పసిపిల్లవాడు మలమూత్రాలలో ఆడుకుంటాడు. పెద్దవాడైన తరువాత వాటి నుంచి దూరంగా వుంటాడు. అలాగే విషయాల వాస్తవమైన స్వరూపం తెలియనంతవరకు వాటిపట్ల ఆసక్తి వుంటుంది. వాటిని జయించడు. వస్తువు యొక్క అసలు స్వరూపము తెలిసిన తరువాత అవి తన దగ్గర వున్నా వాటి పట్ల ప్రవృత్తి కలగదు. విషయాలకు దూరంగా వున్నంతమాత్రాన వాటిని జయించినట్లు కాదు.

కపిలుడు ఇలా చెప్పాడు—

*నిస్సంగే஽ప్యుపరాగో஽వివేకాత్ l*

నిస్సంగత్వంలో కూడా అవివేకం వల్ల రాగము కలుగుతుంది. అవివేకం వున్నంతవరకు స్త్రీల పట్ల వ్యామోహం వుంటుంది. వారికి దూరంగా వున్నా, వారిని చూడటంతోటే లేక తలుచుకోగానే మనస్సు చలిస్తుంది. కానీ శరీరము ఎముకలు, మాంసము మొ॥న వాటితో నిండినదని తెలుసుకుని వైరాగ్యాన్ని పొందినప్పుడు వారు ఎదురుగా నిలబడినా మనస్సు చలించదు. కాబట్టి వివేకం ద్వారా ఇంద్రియాలను నిగ్రహించుకోగలిగే సామర్థ్యం కలుగుతుంది

### తపము

వ్యాకరణంలో 'తప' శబ్దానికి బాధించడం, (తపింపజేయడము) అని అర్థము వ్రాయబడింది. అందుకోసం శరీరాన్ని తపింపజేసే చాంద్రాయణాది వ్రతాలు తపాలుగా పేర్కొనబడ్డాయి.

*శ్లో॥ వేదోక్తేన ప్రకారేణ*
*కృచ్ఛ్ర చాంద్రాయణాదిభిః I*
*శరీరశోషణం యత్తత్తప*
*ఇత్యుచ్యతే బుధైః II*

భావం : "శాస్త్రాలలో చెప్పిన దానినిబట్టి కృచ్ఛ్ర, చాంద్రాయణాది వ్రతాల ద్వారా శరీరాన్ని ఎండగొట్టుకోవడము 'తపము' అని విద్వాంసులు చెబుతారు" — అని సూత సంహితలో చెప్పబడింది.

ఏదైనా పాపము చేసినప్పుడు ఆ పాపానికి ప్రాయశ్చిత్తానికి చేసే తపాలు ఇవి. ముముక్షువుకు చాంద్రాయణము మొ॥న వ్రతాలు ధాతువైషమ్యముచేత హానిని కలుగజేస్తుంది. శరీరంలో బాధలు కలుగుతాయి. కాబట్టే ముముక్షువు కోసం శరీరము, మనస్సు, వాక్కుల చేత చేయబడే మూడు రకాలైన తపస్సులను శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు.

## భగవద్గీతలో చెప్పబడిన మూడు విధముల తపస్సులు

*శ్లో॥ దేవ ద్విజ గురు ప్రాజ్ఞ*
*పూజనం శౌచమార్జవం I*
*బ్రహ్మచర్య మహింసా చ*
*శారీరం తప ఉచ్యతే II*

భావం : దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞానులను పూజించడం; పవిత్రంగా వుండడం, నిష్కపటంగా వుండడం, బ్రహ్మచర్యము, అహింస — ఇవి శారీరక తపస్సులు.

*శ్లో॥ అనుద్వేగకరం వాక్యం*
*సత్యం ప్రియ హితం చ యత్ I*
*స్వాధ్యాయాభ్యసనం చైవ*
*వాఙ్మయం తప ఉచ్యతే II*

భావం : ఇతరులను ఉద్రేకపరచనివి, సత్యము, ప్రియము, హితకరమైన పలుకులను పలకాలి. వేదము మొ॥న వాటిని చదవాలి. వాటి మంత్రాలు జపించాలి. ఇవి వాచికతపములు.

*శ్లో॥ మనః ప్రసాదః సౌమ్యత్వం*
*మౌన మాత్మ వినిగ్రహః I*
*భావ సంశుద్ధి రిత్యేతత్*
*తపో మానస ముచ్యతే II*

భావం : ప్రసన్నమైన మనస్సు, సౌమ్యత్వము, మౌనము, ఇంద్రియ నిగ్రహము, అంతఃకరణ పారిశుద్ధ్యము — ఇవి మానసిక తపాలు.

## శౌచము

శౌచము అంటే పవిత్రంగా వుండటం. ఇది రెండు రకాలు —— 1)బాహ్యాశౌచము 2) అంతఃశౌచము.

వీటి భేదాన్ని ఆదిశంకరాచార్యులు వివరించారు.

*శ్లో॥ బాహ్యామాభ్యంతరం చేతి*
*ద్వివిధం శౌచముచ్యతే I*
*మృజ్జలాభ్యాం కృతం శౌచం*
*బాహ్యం శారీరికం స్మృతమ్ II*

*శ్లో॥ అజ్ఞానదూరీకరణం*
*మానసం శౌచమాంతరం I*
*అంతఃస్థితో భవేత్సమ్యక్*
*బాహ్యం నావశ్యకం నృణామ్ II*

భావం: శౌచము రెండు రకాలు. 1) బాహ్యము, 2) అంతరము. మట్టి, జలము, మొ॥న వాటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవడం బాహ్యాశౌచము. మనస్సు యొక్క అజ్ఞానాన్ని పోగొట్టుకోవడం అంతఃశౌచము. మనుష్యులు అంతఃశౌచాన్ని పొందడానికి ప్రయత్నించాలి. బాహ్యాశౌచము అంత ఎక్కువ అవసరం కాదు.

శౌచమును గురించి ఇతర గ్రంథాలలో కూడా వర్ణించబడింది.

*శ్లో॥ మనఃశౌచం కర్మశౌచం*
*కులశౌచం చ భారత I*
*శరీరశౌచం వాక్ శౌచం*
*శౌచం పంచవిధం స్మృతమ్ II*

భావం : మనశ్శౌచము, కర్మశౌచము, కులశౌచము,

శరీర శౌచము, వాక్ శౌచము అని శౌచము ఐదు రకాలు.

## మనఃశౌచము

శౌచం మానసం తు రాగద్వేషాది ప్రక్షాళనమ్।

భావం : అంతఃకరణము నుండి రాగద్వేషాలు (అసుర, రాక్షస ప్రవృత్తులు) మొదలైన వాటిని పోగొట్టుకోవడం మానసిక శౌచము

## కర్మశౌచము

నిత్యనైమిత్తిక కర్మలను నిష్కామంగా చేయడం కర్మశౌచము. తన జీవిత నిర్వహణకు కపటము, మోసము, ద్రోహము మొ॥నవి చేయకుండటం కర్మ శౌచము.

## కులశౌచము

ఉత్తమ కుటుంబంలో జన్మించి వంశపారంపర్యంగా వైదిక ధర్మాన్ని ఆచరిస్తూ హీన వ్యవహారము, హీన ప్రవర్తన, హీన జీవిక (అంటే కన్యా విక్రయము మొదలైన నీచకర్మల చేత జీవించడం, చెడువృత్తులలో జీవించడం) చేయకుండటం - అటువంటివాడు కులీనుడు. సదాచారంలో స్థిరంగా వుండటం, ఎటువంటి విపత్తి కలిగినా నీచకర్మలను ఆచరించకుండా వుండటం స్వభావసిద్ధంగా వున్నవాడు కులీనుడు. అటువంటి పని కులశౌచము అని చెప్పబడుతుంది.

శరీర శౌచమంటే స్నానాదుల చేత శరీరాన్ని శుభ్రంగా వుంచడం.

సత్యం మాట్లాడడం వాక్ శౌచము.

ఈ ఐదు రకాలైన శౌచాల యందు కర్మశౌచము, కుల శౌచము, శరీర శౌచము బాహ్య శౌచాలు. వాక్ శౌచము, మనఃశౌచము అభ్యంతర శౌచాలు. ఈ ఐదు రకాలైన శౌచాలూ కావలసినవే! అయినా వాటిలో మనఃశౌచము ప్రధానమైనది. మిగిలిన శౌచాలన్నీ మనఃశౌచము మీద ఆధారపడి వున్నాయి. ఆత్మోన్నతికి మనఃశౌచమే చాలా ఉపయోగకరము.

మహాభారతం ఇలా చెబుతోంది—

***శ్లో॥ ఆత్మా నదీ సంయమపుణ్యతీర్థా***
***సత్యోదకా శీలతటా దయోర్మి ।***
***తత్రాభిషేకం కురు పాండుపుత్ర,***
***న వారిణా శుధ్యతి చాంతరాత్మా ॥***

భావం : ఓ ధర్మరాజా! ఆత్మ చింతనము - అంటే పరమాత్మ చింతనము అనే నదికి సంయమము పవిత్రమైన రేవు. దానిలో సత్యమనే జలం ప్రవహిస్తూవుంటుంది. శీలము అనేది తీరము. దయ అనే తరంగాలు లేస్తూవుంటాయి. ఆ నదిలో స్నానం చేయి! నీటితో అంతరాత్మ శుద్ధి చెందదు.

***శ్లో॥ నోదక క్లిన్నగాత్రస్తు***
***స్నాత ఇత్యభిధీయతే ।***
***న స్నాతో యో ద మస్నాతః***
***సబాహ్యాభ్యంతరః శుచిః ॥***

భావం : నీటితో శరీరాన్ని తడపడం స్నానం కాదు. మనసును వశపరచుకోవడమే స్నానము.

## క్షమ

***శ్లో॥ బాహ్యే వాధ్యాత్మికే చైవ***
***దుఃఖే చోత్పాదితే క్వచిత్ ।***
***న కుప్యతి న వా హన్తి***
***సా క్షమా పరికీర్తితా ॥***

భావం : ఎవడైనా తనకు అవమానం చేసినా, తనను బాధించినా అతని మీద కోపగించుకోకుండా వుండటం అతనిని బాధించకుండా వుండటం క్షమ.

క్షమను గురించి భర్తృహరి ఇలా చెప్పాడు: "క్షమా ప్రభవితుః"

ఎవరైనా వచ్చి తనకు శారీరకమైన బాధను కలిగించినా, మానసికంగా సంతాపం కలిగించినా తనకు ప్రతీకారం చేసే సామర్థ్యం కలిగి వుండి కూడా ప్రతీకారము చేయకుండటం క్షమ. ఆ క్షమ అలంకారము వంటిది. అసమర్థుడు ప్రతీకారము చేయలేకపోతే అది క్షమ అనిపించుకోదు.

**- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 2

**మనస్సును నూతనంగా రూపొందించడంలో కేవలశ్రద్ధ యొక్క ప్రాశస్త్యము :**

ఈ ప్రపంచంలో మానవుల చేత సృష్టించుకోబడిన దుఃఖంలో యెక్కువ భాగం బుద్ధి పూర్వకమైన దౌష్ట్యము వలన కంటే అజ్ఞానము, నిర్లక్ష్యము, అజాగ్రత్త, అనాలోచన, తొందరపాటు, ఆత్మనిగ్రహము లోపించుటవల్ల కలుగుతుంది సామాన్యంగా. క్షణమాత్రం వివేకం ప్రదర్శిస్తే నివారణయ్యే దుఃఖపరంపరలు యెన్నో వుంటాయి. ఒకపని చేసే ముందు కేవలశ్రద్ధా స్థితిలో కొంచెం తమాయించినట్లయితే మన మనస్సు ఒక పని చేయబూనే క్షణం మన ఆధీనంలోకొస్తుంది. యోచన క్రియారూపం ధరించకుండా నిలిపి వివేకపూర్వమైన నిశ్చయానికి రావడానికి అవకాశం కల్పిస్తుంది కేవలశ్రద్ధ. మానవుల్లో సంఘటనలకు సందర్భాలకు త్వరపడి రాగద్వేష పూర్వకంగా ప్రతిక్రియ సలిపే స్వభావము వుంటుంది. అట్టి సందర్భాలలో యిది యెంతో ఉపకరిస్తుంది. మాటలలోను, చేతలలోను తొందరపాటు లేకుండా చేస్తుంది. కేవల శ్రద్ధ ద్వారా యిలా నిలకడ సంపాదిస్తే మనస్సుకు సంస్కారం లభిస్తుంది. అవాంఛనీయమైన చేతలు నిలచిపోతాయి. చాలా సందర్భాలలో మనోవాక్కాయాల ప్రతిక్రియ అవసరమే లేదని యీ నిలకడ దొరికినప్పుడు తెలియగలదు. కేవలశ్రద్ధ వలన లభించిన మానసిక శాంతి యితరుల విషయాలలో జోక్యం కలుగజేసుకోకుండా వుండేందుకు మనకు తోడ్పడగలదు. ఎట్టి చిక్కులు తలెత్తవు. మనస్సును సంస్కరించుకోవడం కూడా సులభమౌతుంది.

కేవలశ్రద్ధ వర్తమానం మీదికే దృష్టిని కేంద్రపరుస్తుంది. ప్రస్తుత పరిస్థితినుంచి తప్పించుకొని, గతాన్ని, భవిష్యత్తును గూర్చిన యోచనలలోకి పారిపోకుండడం నేర్పుతుంది. సామాన్యులు భూత భవిష్యత్తుల గురించి నిజమైన అవగాహన కలిగియుండే బదులు పగటికలలుగా పనిచేస్తూ సమ్యక్ స్మృతి (సరియైన అవగాహన) సమ్యక్ కర్మలకు ప్రబల శత్రువులౌతాయి. గతం గూర్చిన వ్యర్థమైన ఆలోచనలలో గతాన్ని నిరర్థకమైన పశ్చాత్తాపంలో నెమరు వేసుకోవడంలో యెంతో శక్తి వృథా అవుతుంది గదా! అలానే భవిష్యత్తును గూర్చిన యోచనలు, ఆశలు, కలలు, భయాలు, చింతల్లో కూడా చాలా సమయం, శక్తి వృథా అవుతూంటుంది. కేవలశ్రద్ధ వీటన్నింటిని తుడిచి వేస్తుంది.

సమ్యక్ స్మృతి మానవుని గతానుభూతి సంకెళ్ళలోంచి విడుదల చేసి వాటిని గూర్చి తలచుకోవటం ద్వారా ఆ బంధాలను దృఢతరం కాకుండా చూస్తుంది. అలానే భవిష్యత్తు విషయంలోనూ. వర్తమానంలో మాత్రమే లభ్యమయ్యే స్వేచ్ఛను పూర్ణంగా వినియోగించుకొనే సామర్థ్యాన్నిస్తుంది.

అంతేగాదు... భూత, భవిష్యత్తులను గూర్చిన ఊహాగానాలు, పగటికలలు ఏకాగ్రతకు విఘ్నాలు. ప్రత్యక్షమైన విషయంపైన మనస్సును కేవల గ్రహణలో నిమగ్నం చేయడం యీ విఘ్నాలను అంతమొందిస్తుంది. అయితే అభ్యాసంలో మనం గుర్తించేలాగా పగటికలలు ప్రవేశించినటులైతే వాటి నిజతత్వాన్ని కేవలశ్రద్ధకు గురిచేస్తే మనస్సును బలహీన పరచగల వాటి సామర్థ్యం నశించి, అవి తొలగిపోతాయి. ఈ విధంగా సాధనకు ప్రతిబంధకాలైన వాటిని ధ్యానానికి సోపానాలుగా మార్చుకోవచ్చు.

నిత్యజీవితంలో మనకు తెలియకనే మనలో పేరుకుపోయే అస్పష్టములు, అసందర్భములు, పాక్షికములు అయిన యోచనలు, ఇంద్రియానుభూతులు, అణచి వేయబడ్డ ఉద్రేకాలు యెన్నో గూడుకట్టుకొని మన మనోకార్యాన్ని ఆటంకపరుస్తాయి. ఇవన్నీ క్రమంగా మన మనస్తత్వాన్ని, గుణాలను, వ్యక్తిత్వాన్ని వికారపరుస్తాయి. మన మనస్సును నూతనంగా, సంకీర్ణంగా రూపొందించడానికి విఘ్నాలౌతాయి. కేవలశ్రద్ధ వీటిని మనకు సుగోచరం చేసి మన మానసిక స్థితిపై మనకు తీవ్ర అసంతృప్తిని కలిగించి సమ్యక్ స్మృతి సాధనకు తీవ్రంగా ఉన్ముఖం చేస్తుంది. వ్యర్థంగా మానసిక శక్తి ఖర్చుకాకుండా చేస్తుంది. ఈ విధంగా కేవలశ్రద్ధ సంకీర్ణంగా రూపొందించడానికి దోహదం చేస్తుంది.

ఎప్పటికప్పుడు మనలో తలెత్తే భావాలపై కేవలశ్రద్ధను కేంద్రీకరించడం వలన మనలోని సామర్థ్యాసామర్థ్యాలు గోచరమై ఆత్మవంచన అంతమొందిస్తుంది. మన సామర్థ్యాసామర్థ్యాల గూర్చిన అజ్ఞానమైన మన మనస్సును మనం సంస్కరించుకోవడానికి ప్రతిబంధకమౌతుంది. కనుక కేవలశ్రద్ధ దీనిని తొలగిస్తుంది. మనలోని అవాంఛనీయమైన విషయాలెన్నో కేవలశ్రద్ధ ద్వారా తక్షణమే గుర్తించగలగడం వాటిని నిర్మూలించుకోడానికి మొదటి మెట్టు. ఇది ఒక కామపూరిత తలంపు అని గాని, ఇప్పుడు నాలో చిత్త సంక్షోభము అను అవరోధమేర్పడిందను గుర్తింపు అంతకంతకు వాటిని మనలో ప్రతిఘటించే శక్తిని మేల్కొల్పుతుంది. అలాగే కేవలశ్రద్ధ మనలో దాగియున్న సామర్థ్యాలను సుగోచరం చేయడం ద్వారా ధైర్యోత్సాహాలను కల్పిస్తుంది.

**మానసిక విమోచనంలో కేవల శ్రద్ధ యొక్క ప్రాశస్త్యము :**

ఈ సాధనా విశిష్టత చవిచూపించడం కోసం కొద్ది రోజులపాటు వ్యక్తులు, పరిస్థితులు, పరిసరాల పట్ల కేవలశ్రద్ధా వైఖరిని పూనమని చెబుతారు. అలా చేయగానే రోజులు తనకెంత సామరస్యంగా తెలిసిపోతాయో తనకే తెలిసివస్తుంది. మనోవాక్కాయాలు స్వల్ప ప్రేరణలకు లొంగి అన్ని విషయాల్లో జోక్యం చేసుకోవడం మానేస్తాడు. ఎంతో శాంతంగా, తృప్తిగా, ఉత్సాహంగా, స్వేచ్ఛగా రోజులు గడుస్తాయి. అదృశ్యమైన రక్షణ తన చుట్టూ ఆవరించినట్లుంటుంది. జనసమ్మర్థం నుండి దూరంగా ఎత్తైన ప్రశాంత కొండ శిఖరానికి వెళ్ళి అక్కడనుంచి క్రిందికి చూస్తున్న వారిలాగ వుంటుంది అతని పరిస్థితి. అందువలన సాటి మానవుల పట్ల రాగద్వేషాదులు శమించి మైత్రి పెరుగుతుంది. జీవితం తేలికగా అవుతుంది. బాహ్యాభ్యంతర ప్రపంచం సువిశాలమౌతుంది. ప్రతి విషయంలోను మనం తల దూర్చకున్నా ప్రపంచ క్రియాకలాపం యెప్పటిలాగా కొనసాగుతుందని తెలియడమే గాక అలా నిగ్రహించుకోవడం వలన మన జీవితం మరింత మెరుగ్గా వుండగలదని గూడ తెలుస్తుంది. ఎన్నో చిక్కులు నివారణవడమే గాక సమస్యలు వాటంతటవే పరిష్కారమౌతాయి. లోకభ్రాంతిని పెంచే దుఃఖకారణమైన కర్మల నుండి కేవలశ్రద్ధ ద్వారా విడివడడం యెంత అవసరమో తెలుస్తుంది. కేవలశ్రద్ధ ద్వారా వ్యక్తులు వస్తువులనుండి, మన నుండి మనము పాక్షికంగాను, తాత్కాలికంగాను దూరమైనా – మన అనుభూతి యేనాటికైనా శాశ్వతంగా అట్టి వైరాగ్యాన్ని సాధించి అట్టి సుఖశాంతులను శాశ్వతం చేసుకోగలమన్న విశ్వాసాన్ని కలిగిస్తుంది. జీవించియుండగానే బంధాలనుండి సంపూర్ణంగా విముక్తి పొందడం యెంత ఆవశ్యకమో అట్టి జీవన్ముక్తావస్థ యెలా వుంటుందో మనం స్వల్పంగా రుచి చూస్తాము. ప్రపంచంలో వుంటూ కూడా దానికి చెందని వారమై వుండడమంటే యేమిటో తెలుస్తుంది. ఉత్తమోత్తమము, శాశ్వతమూ అయిన ముక్తిని సాధించటానికి సాధనమైన లోచూపు (విపస్యన) ను కేవలశ్రద్ధ మనకు ప్రసాదిస్తుంది. ఇదే దానియొక్క పరమప్రయోజనం.

లోచూపంటే జగత్తు అశాశ్వతము, దుఃఖమయము, అనాత్మ అని, గాఢంగా, ప్రత్యక్షంగా గుర్తించడమే! ఇది కేవలం మానసిక అవగాహన మాత్రమే గాక నిస్సంశయము, అచంచలము అయిన స్వానుభవంగా ధ్యానావస్థలో మనం గుర్తించిన అనుభవంగా తెలుస్తుంది. ఈ లోచూపు వైరాగ్యాన్ని పెంచి దుఃఖము యొక్క బానిసత్వము నుండి మనస్సుకు విముక్తిని కలిగిస్తుంది.

కేవలశ్రద్ధలో యీ స్థితిని రుచి చూడటం వలన గమ్యం వైపుకు యెంతో తీవ్రతతో ఆకర్షితుడౌతాడు. గమ్యాన్ని మనోనేత్రం ముందు నిలిపి ప్రక్కదారి పట్టినప్పుడు తిరిగి దారికి రావడానికి దోహదం చేస్తుంది. గమ్యస్థానం కంటబడ్డప్పుడు కాళ్ళు, మనస్సు, నూతనోత్సాహాన్ని, శక్తికి పొందినట్లు సాధకునికి బలాన్ని చేకూరుస్తుంది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

శ్రీ అనంతాచార్యులవారికి నలుగురు కుమారులు. వారు శ్రీ కృష్ణమాచార్య, శ్రీ వేదవ్యాస, శ్రీ బోధాయన, శ్రీ భరద్వాజ. వీరు కారణజన్ములు అనటంలో సందేహం లేదు. వీరు లోకంలోని అందరి పిల్లలవలె కాక అఖండ ప్రజ్ఞావంతులైన తండ్రిగారి పెంపకంలో జ్ఞానసంపన్నులై వెలుగొందారు. వీరు తమ జీవితాలను తమకు, తమ కుటుంబ శ్రేయస్సు వరకు పరిమితం చేసుకొనక, తండ్రి నుండి పొందిన అపార ఆధ్యాత్మిక సంపదను లోకులందరకు పంచియిస్తూ ప్రజలను భక్తి, జ్ఞాన మార్గానువర్తనులుగా చేసే లోకోద్ధారకులై వర్ధిల్లారు.

తమ బిడ్డలను అంత ఉత్తములుగా తీర్చిదిద్దటానికి శ్రీ అనంతాచార్య చేసిన కృషి, పడిన శ్రమ అపారం. ఆయన తమ బిడ్డలను పెంచిన విధానం కూడా ఎంతో విశిష్టమైన రీతిలో వుండేది. శ్రీ అనంతాచార్యులవారు ఈ కాలంలోని తల్లిదండ్రులవలె మూడవ యేటనే పిల్లలకు అక్షరాభ్యాసం చేయించటాన్ని తీవ్రంగా విమర్శించేవారు. అది సరియైన విధానం కాదని ఆ వయస్సులోని పిల్లల వ్రేళ్ళు అక్షరాలు దిద్దేటందుకు, వ్రాసేటందుకు ఏమాత్రం పటుత్వాన్ని కలిగి యుండక పోవటం వలన బలవంతంగా వారిచేత వ్రాయించటం వలన వారి సుకుమారమైన చేతివ్రేళ్ళు బలమైన ఒత్తిడికి లోనై, తత్ఫలితంగా వారి సున్నితమైన నరాల వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడుతుందనీ, ఆ పరిస్థితి భవిష్యత్తులో వారికి అనేకానేక శారీరక మానసిక వ్యాధులు కలిగే పరిస్థితికి దారి తీస్తుందనీ చెప్పేవారు. అందువలన పిల్లలకు 5, 6 సం॥ల వయస్సులో అక్షరాభ్యాసం చేయించాలనీ ఈ లోపు వారికి వ్రాతపని లేకుండా కేవలం నోటితో అక్షరాలు, అంకెలు, ఎక్కాలు, భారత భాగవత శ్లోకాలు, భగవద్గీత, నోటి లెక్కలు, నీతిపద్య శతకాలు యిలా ఎన్నెన్నో వల్లింపజేస్తూ కంఠస్థం చేయించాలనీ చెప్పేవారు. అందువలన వారు తమ బిడ్డలకు 5 సం॥ల వయస్సు వచ్చిన తర్వాతనే అక్షరాభ్యాసం చేయించారు. అంతేకాదు వారు తమ బిడ్డలను అక్షరాభ్యాసం చేయించిన తర్వాత అందరివలె పాఠశాలలకు పంపలేదు. శ్రీ అనంతాచార్య తమ కుమారులను పాఠశాలలకు పంపకపోవటంలో నేటి సమాజ పరిస్థితులు పసిపిల్లలలో సద్వర్తనను పెంపొందించే బదులు చెడు అలవాట్లకు, చెడు భావాలకు బీజాలు వేసి వారి మనసులను కలుషితం చేస్తాయనీ, తద్వారా పిల్లలు భవిష్యత్తులో తమకు, సమాజానికీ చెరుపు చేసే ప్రమాదకర వ్యక్తులుగా పరిణమిస్తారనీ ఆయన ఉద్దేశం. అందువలన మలినాలంటని స్వచ్ఛమైన మనసులు కల తమ కుమారులను బయట పిల్లలతో కలువనీయక దేవాలయంలాంటి తమ గృహంలోనే వారిని దైవభక్తి, క్రమశిక్షణ, సద్భావాలతో పెంచి, ఐహిక, ఆధ్యాత్మిక రంగాలలో సుశిక్షితులను చేశారు శ్రీ అనంతాచార్య.

శ్రీ అనంతాచార్యులవారు తమ కుమారులకు తామే గురువైమామూలువిద్యతోపాటువేదవేదాంగాలు,పురాణాలు, ఉపనిషత్తులు, జ్యోతిషం, భగవద్గీత, విజ్ఞాన గ్రంథాలు, నేటి పాఠశాలలో బోధించే పాఠ్యాంశాలు, సంస్కృతాంధ్రాంగ్ల భాషలను కూడా స్వయంగా బోధించేవారు. ప్రాణాయామం, యోగాభ్యాసం నేర్పించేవారు. దండాలు, మల్లయుద్ధం, బస్కీలు, కుస్తీపట్లు వంటి వ్యాయామ సంబంధమైన విద్యలను కూడా నేర్పించేవారు. ఆయన ఉదయపు వేళలో పిల్లలను కూర్చోబెట్టుకొని కొన్ని గంటలు విద్య గరపి, అటు తర్వాత తమ వృత్తి ధర్మంపై బయటకు వెళ్ళేటప్పుడు

తాము మళ్ళీ యింటికి తిరిగి వచ్చేసరికి పిల్లలు ఏమేమి పాఠాలు నేర్చుకొనాలో చెప్పి వెళ్ళేవారు. తిరిగి యింటికి వచ్చిన తర్వాత తాము యిచ్చిన హోంవర్క్ చేశారో లేదో పర్యవేక్షించేవారు. మేధావంతులైన ఆయన కుమారులు కూడా ఎంతో తక్కువ కాలంలోనే తండ్రి నేర్పించిన పాఠ్యాంశాలన్నీ నేర్చుకొనేవారు. వారికి 12-13 సం॥లు వచ్చేసరికి మెట్రిక్యులేషన్ పరీక్షకు తర్ఫీదునిచ్చి బెనారస్ తీసుకొని వెళ్ళి అక్కడ మెట్రిక్ పరీక్షలు వ్రాయించేవారు. ఆ తర్వాత కళాశాలలకు పంపేవారు.

కేవలం విద్యలలోనే కాదు, శ్రీ అనంతాచార్యులవారు తమ పిల్లలను సద్వర్తనులుగా చేయటంలోను చక్కని తర్ఫీదునిచ్చేవారు. చక్కని క్రమశిక్షణ, సహనం, తమ పనులకై యితరులపై ఆధారపడకుండా స్వయంశక్తితో పనులు నిర్వర్తించుకొనటం, ఋజువర్తనులుగా మెలగటం, పట్టుదలతో కార్యములను సాధించుకొనటం వంటి సద్గుణాలనెన్నింటినో వారు తమ బిడ్డలకు నేర్పి వారిని ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దటమే కాక, దైవభక్తి, ఆధ్యాత్మిక జీవితానురక్తి వారిలో పెంపొందించారు. పుట్టుకతోనే జ్ఞానవంతులైన ఆ కారణజన్ములు తండ్రి శిక్షణలో మరింత తేజోవంతులై, సద్వర్తనులై లోకవిఖ్యాతి గాంచారు.

శ్రీ అనంతాచార్య తమ పిల్లలకు చిన్న వయసు నుండీ ఎవరి పనులను వారే స్వయంగా చేసుకోవాలనీ, యితరులపై ఆధారపడకూడదనీ చెప్పేవారు. కాలేజీలో చేరాలన్నా, బుక్స్ కొనుక్కోవాలన్నా, ఫీజులు కట్టాలన్నా, డాక్టరు దగ్గరకు వెళ్ళాలన్నా ఎవరికి వారు స్వయంగా చేసుకొనవలసిందే. అందుకు కావలసిన డబ్బు యివ్వటమే తప్ప సహాయంగా తాము వెంట వెళ్ళేవారు కాదు. "మనం వారి వెనుక వుండి వారికి పని నేర్పించాలి. లేకపోతే వాళ్ళు నేర్చుకొనేదెప్పుడు? అలా వాళ్ళే స్వయంగా చేసుకొంటున్నప్పుడు అందులోని సాధక బాధకాలన్నీ వాళ్ళు తెలిసికోగలుగుతారు" అని చెప్పేవారు. పిల్లలు ఏదైనా పొరపాటుగా ప్రవర్తించినా, తప్పుపని చేసినా వారిని క్షమించి వూరుకొనక వాళ్ళ తప్పును వాళ్ళకు తెలియజెప్పి వారిని గట్టిగా దండించేవారు. తిరిగి వాళ్ళు జీవితంలో ఎన్నడూ అటువంటి పొరపాటును చేయని విధంగా వారికి తెలియజెప్పేవారు. చిత్రమేమంటే శ్రీ అనంతాచార్య తమ పిల్లలు తప్పుచేస్తే దండించే సమయంలో వారి శ్రీమతి లక్ష్మిగారు వారి మధ్యకు వెళ్ళి తండ్రిగారిని వారిస్తే, ఆ తండ్రీ కొడుకులు ఆమెను అడ్డు రావద్దంటూ నెట్టివేసేవారు! పిల్లలు కూడా "మేము చేసిన తప్పుకు నాన్నగారు వేసే శిక్షను మేమే అనుభవించాలి. మధ్యలో నీవు అడ్డురావద్దు" అని పలకటం విశిష్టమైన శ్రీ అనంతాచార్యులవారి శిక్షణలో పెరిగిన ఆయన తనయులకు తప్ప ఎవరికి సాధ్యం?

శిక్షలు వేయటం, శిక్షణ నివ్వటమే కాదు మూర్తీభవించిన ప్రేమస్వరూపునిగా తనయులను అనురాగంతో ఆప్యాయతతో లాలించేవారు, ఆదరించేవారు శ్రీ అనంతాచార్య. తమ అర్ధాంగి యీ లోకం వీడిపోయినప్పుడు ఆయన పిల్లలకు తామే తల్లి పాత్ర వహించి తల్లిలేని లోటును, దైన్యాన్నీ పిల్లలకు ఏమాత్రము కలుగనివ్వక వారి సకల అవసరాలు ఒంటరిగా ఎంతో సమర్థతతో నిర్వహించారు. గురువై విద్య గరపారు. వారికి ఎట్టి పరిస్థితిలోనూ ఏ లోటూ రానివ్వక వారు కోరినవన్నీ కొని యిచ్చి సంతోషపెట్టేవారు. పండుగ రోజులలో మాత్రమే కాదు, నలుగురు పిల్లల పుట్టినరోజు వేడుకలకు నలుగురికీ తలంటు స్నానాలు, కొత్తబట్టలు, నలుగురికీ యిష్టమైన పిండి వంటలతో భోజనాలు పెట్టి వారిని సంతోషపరచేవారు. అంతే కాదు, వాళ్ళు ఎప్పుడు ఎక్కడకు వెళ్దామంటే అక్కడకు మద్రాసు వంటి దూర ప్రాంతాలకైనా కోరినచోటుకు తీసుకెళ్ళి అక్కడ వినోదం, విజ్ఞానం, అందించే ప్రదేశాలన్నీ చూపించి వారికి ఆనందాన్ని కలిగించేవారు. అందుకుగాను ఎంత డబ్బు ఖర్చు పెట్టేందుకైనా వెనుకాడేవారు కాదు.

శ్రీ అనంతాచార్యలోని మరొక విశిష్టమైన గుణం పిల్లలకు భావస్వాతంత్ర్యాన్నివ్వటం. వారు అభ్యసించవలసిన విద్యల విషయంలో గానీ, ఉద్యోగాల విషయంలో గానీ, వివాహం వంటి ముఖ్యమైన జీవిత నిర్ణయాల విషయంలో గానీ యింకా యిలాంటి కొన్ని ముఖ్య విషయాలలో వారు పిల్లల వ్యక్తిగత నిర్ణయాలకే ప్రాముఖ్యత నిచ్చేవారు గానీ, బలవంతంగా తమ భావాలను, నిర్ణయాలను అనుసరించమని పిల్లలను నిర్బంధించేవారు కాదు. తమ చిన్న కుమారుడు శ్రీ భరద్వాజ వివాహం చేసుకోనన్న తన నిర్ణయాన్ని తండ్రితో ఖచ్చితంగా వెల్లడించినప్పుడు శ్రీ అనంతాచార్యకు ఆ నిర్ణయం ఏ మాత్రం తమకు సమ్మతం కాకున్నా కుమారుని యిష్టానికే అతని జీవిత సమస్యను వదలి వేశారు. అలాగే తమ కుమారులు డాక్టర్లు అవ్వాలన్న తమ కోరికను కూడా కుమారుల వద్ద వెల్లడించారే గానీ నిర్బంధించలేదు. శ్రీ భరద్వాజగారు కళాశాల అధ్యాపకులుగా వృత్తిని చేపట్టినప్పుడు తండ్రి సంతోషించారే తప్ప ఏ మాత్రం అసంతృప్తి చెందలేదు.

అంతేకాదు, శ్రీ అనంతాచార్య కులమత భేదాలకతీతులు. బెనారస్ కు చెందిన అగర్వాలా అనే పార్శీ మతస్థుడు శ్రీ అనంతాచార్యులవారికి స్నేహితుడు. అతడు తన కుమార్తెను శ్రీ భరద్వాజగారికిచ్చి వివాహం చేయాలని వుందని శ్రీ అనంతాచార్యగారితో అన్నప్పుడు తాము హిందువులు,బ్రాహ్మణులుఅయినప్పటికీఅందుకుఏమాత్రం అభ్యంతరం చెప్పలేదు. కానీ వివాహానికి విముఖులుగా వున్న శ్రీ భరద్వాజగారు అందుకు అంగీకరించకపోవటం జరిగింది. ఏ విషయంలో నైనాసరే వ్యక్తి గుణగణాలకు, సౌశీల్యానికే విలువనివ్వాలే కానీ కులమతాలకు ప్రాధాన్యతనివ్వకూడదని చెప్పేవారు. అందుకు నిరూపణగా ఆయన తమ యింట్లో ఆశ్రయమిచ్చిన పేద విద్యార్థులలో కేవలం బ్రాహ్మణులే కాక అన్యకులాల పిల్లలు కూడా తమ పిల్లలతో పాటు కలసి మెలసి సంచరించేవారు. ఆయన ఎవరినీ కించపరచక అందరినీ సమానంగా ప్రేమించేవారు, ఆదరించేవారు.

అంతేకాదు, శ్రీ అనంతాచార్య సనాతన సంప్రదాయాలను అంటిపెట్టుకొని తమ కుమారులు సంప్రదాయబద్ధంగా నడవాలని ప్రోద్భలం చేయలేదు. ఉదాహరణకు శ్రీ భరద్వాజని ఉపనయనం చేసుకొమ్మని శ్రీ అనంతాచార్య ఆదేశిస్తే "ఉపనయనం ఎందుకు చేసుకోవాలి? దాని వలన ప్రయోజనమేమిటి?" అని ప్రశ్నించారు శ్రీ భరద్వాజ. అంతేకాదు ఉపనయనం చేసుకొనేందుకు విముఖతను కూడా వ్యక్తం చేశారాయన. అపుడు కూడా శ్రీ అనంతాచార్య పుత్రుని నిర్బంధించలేదు. చేసుకుతీరాలని ఒత్తిడి చేయలేదు. ఆ నిర్ణయాన్ని కూడా ఆతని యిష్టానికే వదిలేశారు. కొన్నాళ్ళ తర్వాత 'ఉపనయనం' క్రతువులో ఏమి పరమార్థం దాగివుందోనన్న కుతూహలంతో తనంతట తాను వచ్చి ఉపనయనం చేసుకోవాలనుకొంటున్నానని, తనకు ఉపనయనం చేయమనీ కోరినపుడు మాత్రమే తండ్రి శ్రీభరద్వాజకి ఉపనయనం చేయటం జరిగింది.

శ్రీ అనంతాచార్యగారికి తమ కుమారులపై, వారి సద్వర్తనపై ఎంతో నమ్మకం వుండటం వల్ల వారి భావాలు, నిర్ణయాలు ఎప్పుడూ సరిగానే వుంటాయని, తాము కష్టపడి తీర్చిదిద్దిన వారి వ్యక్తిత్వాలు వారిని ప్రక్కదోవలు పట్టించక ఋజువర్తనులనుగా నడిపిస్తాయనే దృఢ విశ్వాసంతో వారికి సంపూర్ణమైన భావస్వేచ్ఛను యిచ్చి వారి నిర్ణయాలను గౌరవించేవారు.

ఆయన భావించినట్లే వారి కుమారుడు శ్రీ భరద్వాజ మొదట ఉపనయనం వద్దనటం, ఆ తర్వాత అందులో ఏముందో తెలిసికొనాలనే కుతూహలంతో ఉపనయనం జరిపించమనటం, సరిగ్గా ఉపనయన సమయంలోనే శ్రీ భరద్వాజగారి మమతను చూరగొన్న శ్రీ కృష్ణమాచార్యుల కుమారుడు మరణించటం అనే ఘట్టం శ్రీ భరద్వాజ మనస్సు చలింపజేసి, ఆయన తీవ్ర పరితాపం నుండి జనియించిన ఆత్మశోధన ఆయనకు యజ్ఞోపవీత సూత్రధారణలోని పరమార్థాన్ని తెలియజేసి ఆయన జీవితంలో గొప్ప మార్పుకు నాంది పలకటం జరిగింది.

ఈ విధంగా తమ కుమారులను ఏ విషయంలోనూ తమ ఉద్దేశాల ప్రకారం నడుచుకొమ్మని నిర్బంధించని శ్రీ అనంతాచార్య ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం గల తండ్రిగా లోకానికే ఆదర్శపురుషుడు అనటంలో సందేహం లేదు.

శ్రీ అనంతాచార్య గొప్ప సంఘసేవా తత్పరులు. వారు ఎందరో పేద విద్యార్థులను స్వంత ఖర్చులతో చదివించారు. ఎందరికో తమ యింట్లోనే ఆశ్రయమిచ్చి తమ పిల్లలతో సమానంగా వసతి కల్పించి విద్యాబుద్ధులు గరపారు. ఎందరికో ఉచితవైద్య సేవలందించారు. ఎందరో పేదలకు వివాహం, జీవనోపాధులు సమకూర్చుకొనేందుకు సహాయపడ్డారు. ఉచిత తాలింఖానాలు నడిపారు. 'భరద్వాజ గురుకులం' పేరుతో విద్యాలయం స్థాపించి విద్యార్థులకు ఉచిత విద్య నందించటమే కాక, వారికి ఉచితంగా పాఠ్య పుస్తకాలు యిచ్చి, ఆవుపాలు, రొట్టెలు, భోజన వసతి కల్పించి విద్య గరపేవారు. ఆ విద్యాలయంలో మామూలుగా అన్ని పాఠశాలలో వలె గణితము, సైన్సు, సోషల్ స్టడీస్, ఆంగ్లం, తెలుగు మొదలైన సబ్జెక్టులు బోధిస్తూ; వాటితో పాటు వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, భగవద్గీత, సంస్కృతం కూడా నేర్పేవారు. వ్యాయామం, మల్లవిద్య వంటి విద్యలు కూడా బోధించేవారు. తమ పిల్లలకు కూడా ఆ విద్యాలయంలోనే విద్యనభ్యసింప జేశారు. ఉత్సాహవంతులైన యువకులకు ఆయుర్వేద విద్య, మందులు తయారుచేసే విధానం నేర్పించేవారు. తెనాలిలో చంద్రమౌళి సత్యనారాయణ అనే మిత్రుడు "అలా ఉచితంగా వైద్యం, మందుల తయారీ అన్నీ చెప్పేస్తున్నావేమిటి?" అని ప్రశ్నిస్తే "నాకు డబ్బుపై ఆశ లేదు. కావాలంటే నీకు కూడా ఎంతైనా నేర్పిస్తాను నేర్చుకో" అని సమాధానమిచ్చేవారు.

శ్రీ అనంతాచార్యులుగారికి ధనంపై ఎటువంటి ఆసక్తి,

ఆస్తిపాస్తులపై ఎటువంటి ఆపేక్ష లేశమాత్రమైనా వుండేది కాదు. పేద ప్రజలకెందరికో ఉచితవైద్యం అందించినప్పటికీ కూడా శ్రీ అనంతాచార్యులవారికి వైద్యవృత్తి ద్వారా ఆ రోజుల్లోనే నెలకు 50వేల రూపాయలకు పైగా ఆదాయం వచ్చేది. ఆయన స్నేహితులు, బంధువులు, హితోభిలాషులు ఆయనను పొలాలు, స్థలాలు ఏర్పరచుకొమ్మని, స్వంత యిళ్ళు కట్టించుకొమ్మనీ సలహాలు యిచ్చేవారు. నలుగురు పిల్లలనూ పెంచి, పెద్దచేసి, చదువులు చెప్పించి జీవితాలలో స్థిరపరచటానికి ఎంతో వ్యయం అవుతుందని, కనుక ఆస్తులు ఏర్పరచుకొని ముందుచూపుతో పిల్లల భవిష్యత్తు నాలోచించి కొంతధనం నిల్వచేసుకొనటం మంచిదనీ చెప్పేవారు. అయితే శ్రీ అనంతాచార్య తమ సంపాదనలో తమ కుటుంబ ఖర్చులకు పోను మిగిలిన డబ్బును పేదసాదలకు పంచేసేవారు. పిల్లల కోసంగానీ, తమ కోసంగానీ ఒక్క రూపాయి కూడా ఆయన దాచుకొని ఎరుగరు. "తనపై తనకు నమ్మకం లేనప్పుడే డబ్బుపై ఆశ, ఆసక్తి వుంటుంది. నాకు నాపై విశ్వాసం వుంది. అందువల్ల నాకు ఎలాంటి ఆస్తులు ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకత లేదు. ఆస్తుల వల్ల పిల్లలకు అహంకారం పెరుగుతుంది. ధనవంతులమనే గర్వం వస్తుంది. అంతేకాదు, ఆస్తులను దుర్వినియోగం చేసుకోనూవచ్చు, పోగొట్టుకోనూవచ్చు. వారికి 'విద్య' అనే ఆస్తిని యిస్తాను గానీ డబ్బుగా యివ్వను. ఎంతవరకు చదువుకుంటామంటే అంతవరకు చదివిస్తాను" అని చెప్పేవారు. అన్నట్లుగానే ఆయన పిల్లలకు ఆస్తులు ఏమీ యివ్వలేదు. స్వంత గృహాలు, పొలాలు వంటివేవీ ఏర్పరచలేదు. ధనం రూపేణా ఒక్క రూపాయి అయినా యివ్వలేదు. బంగారు, వెండి నగలు, ఆభరణాలు, పాత్రలు, విలువైన సామాగ్రి వస్తు వాహనాలేవీ సమకూర్చలేదు.

స్వయంశక్తిపై జీవించటం, దాన ధర్మనిరతి, ఋజువర్తన, భూతదయ, పరోపకార తత్పరత, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన - ఇవీ ఆ తండ్రి తనయులకిచ్చిన అంతులేని ఐశ్వర్యాలు, ఎన్నటికీ తరగని ఆస్తులు!!

అంతేకాదు, శ్రీ అనంతాచార్యగారిలోని అసామాన్య దైవీగుణం - మూర్తీభవించిన మానవత్వం! మానవతకు మారుపేరు శ్రీ అనంతాచార్య అని చెప్పవచ్చు. అందుకు ఉదాహరణగా విస్మయం కలిగించే ఒక సన్నివేశం వ్రాస్తాను.

ఒకసారి వేరొక గ్రామంలో నివసించే వీరి దగ్గరి బంధువు ఒకామె స్ఫోటక వ్యాధితో మరణించింది. ఆ తర్వాత జరుగవలసిన కార్యక్రమాలు జరిపేందుకు ఆమె బంధువులు, భర్త, పిల్లలు కూడా ముందుకు రాలేదు. ఆ వ్యాధి తమకు సోకుతుందేమోనన్న భయంతో వారు దూరంగా వుండిపోయారు. అపుడు శ్రీ అనంతాచార్యగారు ఒక్కరే ఆమె శరీరాన్ని భుజంపై స్మశానానికి మోసుకుపోయి దహనం చేసి వచ్చారు. ఆయనలోని పరిపూర్ణ మానవత్వానికి, ఎటువంటి పరిస్థితికీ చలించని ధీరత్వానికీ యింతకంటే నిదర్శనం మరొకటి ఏముంటుంది?

**- సశేషం**

---

## సాయి అవతరణే మానవాళికి గురుపూర్ణిమ

03వ పేజీ తరువాయి

కనుక సాధకుని ప్రధాన కర్తవ్యం తన పూర్ణగురుని పూర్ణస్థితిని తన హృదయఫలకం మీద స్పష్టంగా ముద్రించుకోవడమే! అందుకు సాధనముగా గురుపూర్ణిమనాడు సద్గురుని పూజించుకునే ఆచారం అనాదిగా వస్తున్నది. అందుకు ఉత్తమమైన సాధనం పూర్ణగురుని చరిత్ర పారాయణ చేయడమే!

వ్యక్తి జీవితములో పైన చెప్పిన రీతిన ఆత్మవికాసములో కొన్ని దశలు లేక కళలు కనిపించినట్లు, మానవజాతి చరిత్రలో కూడా జరుగుతుంది కాబోలు. ఇంతకు ముందటి గురువుల అవతరణ వివిధ దశలు అనుకుంటే సాయీశుని అవతరణయే మానవాళికి గురుపూర్ణిమ.

సకలజీవులు, దేవతలు, యావద్విశ్వంతమరూపమేనని; భగవంతుడు మానవులందరికీ ఒక్కడేనని, ఆయనను ఆరాధించడానికి మతభేదం అప్రస్తుతమని తెలుపుతూ, ప్రతి మతస్థునికీ అతని మతజీవిత పరాకాష్టను తనలో చూపిన వేరొక గురుస్వరూపమేదీ చరిత్రలో కనిపించదు. అందుకే 'పాల్ రెప్స్' అనే పాశ్చాత్యపండితుడు శ్రీ సాయి అవతరణ మానవజాతి యొక్క ఆధ్యాత్మిక చరిత్రలోనే మైలురాయి వంటిదని, నూతన యుగానికి నాందియనీ అన్నాడు. అంతటి మహనీయుని అనుగ్రహాన్ని చవిచూసిన మనం గురుపూర్ణిమను సార్థకం చేసుకుందాము.

'తల్లికి తగ్గ బిడ్డలు కండి, మీ ఆధ్యాత్మిక ధనాగారాలను నింపుకోండి' అన్నారు సాయి.●

---

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

అమ్మ ఆదేశానుసారం శశాంక బాబు, ఆయన కుమార్తె గురుప్రియ సిద్ధేశ్వరీ ఆశ్రమంలోనే వుండసాగారు. శశాంక బాబుతో అమ్మ యికనుండి ఆయన బాహ్య పూజలేవీ చేయనవసరం లేదని, కాలమంతా జపధ్యానాదులకు, సాధనకు వినియోగించాలని ఆదేశించటంతో ఆయన దినచర్య వేరొక విధంగా మారిపోయింది. రోజులో యేదో ఒక సమయంలో ఆయన సిద్ధేశ్వరి పీఠస్థానంలో కొంతసేపు కూర్చొని గడుపుతుండేవారు. ప్రతిరోజు తెల్లవారుఝామునే లేచి తటాక స్నానం చేసి గదికి వచ్చి కొంతసేపు ప్రాణాయామం చేసేవారు. అప్పటి నుండి మధ్యాహ్నం వరకు జపంలోనే గడిపేవారు. మధ్యాహ్నం లేచి కొంచెం ఆహారం తీసుకుని మరల అదే ప్రదేశంలో కూర్చుని జపం కొనసాగించేవారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో రమణాశ్రమం వెళ్లి అమ్మను దర్శించి అక్కడ యే ప్రసాదం వుంటే అది తిని రాత్రి 9, 10 గంటల వరకు అమ్మ సన్నిధిలోనే గడిపేవారు. ఆ తర్వాత అమ్మ సేవలో వున్న తన కుమార్తె గురుప్రియతో సిద్ధేశ్వరి వచ్చేవారు. ఆశ్రమానికి వచ్చిన తర్వాత కూడా రాత్రి 12, 1గం. వరకు జపంలోనే గడిపేవారు శశాంకబాబు. ఆ విధంగా శశాంక బాబు ఆధ్యాత్మిక సాధన అమ్మ పర్యవేక్షణలో, అమ్మ యొక్క ఆశీస్సులతో నిరాటంకంగా సాగిపోతూవుంది.

1931వ సంవత్సరములో ఊయల పూర్ణిమ రోజున అమ్మ సన్నిధిలో డోలోత్సవ పండుగ కన్నుల విందుగా జరిగింది. రాజేంద్ర తుషార్ అనే భక్తుని భార్య అమ్మను యెంతగానో ప్రార్థించటంతో అమ్మ డోలోత్సవం జరుపుకునేందుకు అనుమతించారు. రమణాశ్రమంలో పుష్పాలతో అలంకరింపబడిన ఒక పెద్ద ఊయలను సిద్ధం చేశారు. ఆ రోజు ఉదయాన పూజాదికములు, అనుష్ఠానాలు ముగిసిన తర్వాత స్త్రీలందరూ అమ్మను ఊయలలో కూర్చోబెట్టి ఊయల వూపారు. ఆ తర్వాత స్త్రీలందరూ ఒకరి తరువాత ఒకరు ఊయలలో అమ్మ ప్రక్కన కూర్చుని ఊయల వూగారు. ఆ సందర్భంలో అందరూ అమ్మపై రంగులు చల్లుతుంటే అమ్మ కూడా స్త్రీలపై రంగులు చల్లారు. ఆశ్రమమంతా స్త్రీల హడావిడి, నవ్వులు, సరదా సంభాషణలతో ఎంతో కోలాహలంగా, సందడిగా గడిచిపోయింది. ఆ తర్వాత అమ్మ స్త్రీలందరిని వెంటబెట్టుకొని ఆశ్రమ కోనేటి వద్దకు వెళ్లి కోనేటిలో దిగారు. ఎంతోసేపు జలక్రీడల కార్యక్రమం సాగింది. ఆశ్రమంలో ఒక ప్రక్క నివేదనల కోసం వంటలు వండసాగారు. కోనేటి స్నానాలు అనంతరం అమ్మ సంకీర్తన గృహానికి వచ్చి సంకీర్తన ఆరంభించారు. సంకీర్తన జరుగుతుండగా అమ్మ ఒక పెద్ద గిన్నె నిండా మంచి గంధాన్ని తెప్పించి స్త్రీలందరి తలలపై అద్దారు. ఆ తర్వాత పూజ, నివేదనల అనంతరం భక్తులందరూ ప్రసాదాలు స్వీకరించారు. ఈ విధంగా సాయంత్రం వరకు డోలోత్సవ కార్యక్రమం యెంతో వైభవంగా జరిగింది. ఆ తర్వాత భక్తులంతా అమ్మకు నమస్కరించుకొని అమ్మ వద్ద సెలవు తీసుకుని తమ తమ యిళ్లకు వెళ్లిపోయారు.

ఒకసారి అమ్మ కలకత్తాలో ప్యారీబాను బంగళాలో వున్నప్పుడు బాలాబాబు అనే భక్తుడు అమ్మను దర్శించి

తన గృహానికి విచ్చేయవలసినదిగా ప్రార్థించాడు. అమ్మ అంగీకరించి అతని యింటికి వెళ్లి అక్కడ కొన్ని రోజులు వున్నారు. అమ్మ యెప్పుడు కలకత్తా వెళ్ళినా తండోపతండాలుగా భక్తులు అమ్మ దర్శనార్థం వస్తుండేవారు అలా ప్రవాహంలాగా యెడతెరిపి లేకుండా వస్తున్న భక్తులను అమ్మ యేమాత్రం ఆటంక పరచక రాత్రింబగళ్లు వారి మధ్యనే కూర్చుని మాట్లాడుతుండేవారు. ఆ పరిస్థితి చూసి అమ్మ బాగా అలసిపోతున్నారని, ఆమెకు విశ్రాంతి నివ్వాలని భావించి పగలు 12 గంటల వరకు, రాత్రి తొమ్మిది గంటల వరకు మాత్రమే అమ్మ దర్శనం వుంటుందని ప్రకటించారు. అయితే అమ్మ ఆ నిబంధనలన్నింటినీ ప్రక్కన పెట్టి తానే బయటకు వెళ్లి వాళ్ళ మధ్య కూర్చొనటం మొదలుపెట్టారు. బాలాబాబు భక్తులకు నోటితో చెప్పలేక రాత్రి 9 గంటలకు పగలు 12 గంటలకు గేటు తలుపులు మూసివేసేవాడు అయితే భక్తులు మాత్రం యిదంతా అమ్మ విశ్రాంతి తీసుకోవాలనే వుద్దేశ్యముతో చేస్తున్నారన్న విషయం అర్థం చేసుకుని అందుకు సహకరించ సాగారు.

అమ్మ బాలాబాబు యింట్లో వుంటున్నప్పుడు ఒకరోజు ఒక చిత్రమైన సన్నివేశం జరిగింది. ఆరోజు అమ్మ భక్తులతో మాట్లాడుతున్నారు. సమయం పగలు 12 గంటలు కావస్తున్నది. భక్తులు 'అమ్మా యింక బయలుదేరుతాము సెలవిప్పించండి' అంటూనే వున్నారు గాని ఒక్కరు కూడా కదలటం లేదు. చివరికి ఎలాగో 12 గంటలు దాటాక యిక తప్పదు అన్నట్లు వారంతా లేచి అమ్మ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయారు. అందరూ వెళ్లిపోయిన తర్వాత భోజన ప్రసాదాలు స్వీకరించి అందరూ తమ గదులలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురుప్రియ, మరి యిద్దరు స్త్రీలు అమ్మ దగ్గర కూర్చుని విసనకర్రలతో అమ్మకు విసురుతున్నారు. అది వైశాఖ మాసం. బయట యెండ తీవ్రంగా కాస్తున్నది. అమ్మ వున్నట్లుండి లేచి కూర్చున్నారు. సమయం మధ్యాహ్నం రెండు గంటలయింది. అమ్మ లేచి నేరుగా బాలాబాబు వున్న గదిలోకి వెళ్లారు. నిద్రపోతున్న బాలాబాబును లేపి, "లే, పద, వెళ్దాం" అన్నారు. అమ్మను చూచి బాలాబాబు కంగారుగా లేచి నిలబడి, "అమ్మా! యెక్కడికమ్మా" అన్నాడు. "బయటకు" అంటూ మరేమీ మాట్లాడకుండా బాలాబాబు చేయి పట్టుకుని బయటకు నడిచారు. అమ్మా! అమ్మా! యేమిటమ్మా యిది? ఇంత యెండలో బయటకు వెళ్తారా? అంటూ బాలాబాబు యెంతగా వేడుకున్నా, అమ్మ అసలు వినిపించుకోవటం లేదు. "అమ్మా! యిలా చేస్తున్నారేమిటమ్మా? మేమందరము యెంతగానో కష్టపడి భక్తులకు నచ్చజెప్పి పంపించి వేస్తున్నది యెందుకు? మీరు విశ్రాంతి తీసుకోవాలనే కదా? ఈ విధంగా మీరీవేళలో వీధులలో తిరుగుతుంటే భక్తులు చూస్తే నా గురించి యేమనుకుంటారు? వారికి నేనేమీ సమాధానం చెప్పుకోవాలి?" అంటూ చాలాసేపు బాలాబాబు అమ్మను యింటికి వెళ్దామని బ్రతిమాలుతున్నా, అమ్మ అతని మాటలు యేమాత్రం పట్టించుకోకుండా పెద్దగా నవ్వుతూ, "నేనెంత తలతిక్క మనిషినో మీకు తెలియదా? నేనే కాదు, మిమ్మల్ని కూడా విశ్రాంతి తీసుకోనివ్వను" అంటూ ఆ వేసవికాలంలో మిట్టమధ్యాహ్న వేళలో తీవ్రమైన యెండలో వీధులన్నీ తిరగసాగారు.

అమ్మ ఆ విధంగా యెండలో వీధులలో తిరుగుతున్నారని తెలుసుకున్న భక్తులు తమ యిండ్ల నుండి బయలుదేరి వచ్చి అమ్మను కలుసుకొని అమ్మతోపాటు వారు కూడా తిరుగసాగారు. అమ్మ అలా తిరుగుతూ తిరుగుతూ వీధుల్లోని మిఠాయి దుకాణాల నుండి మిఠాయి తీసుకొని అందరికీ పంచసాగారు. అలా సాయంత్రం వరకు తిరిగి తిరిగి ఆ తర్వాత అమ్మ నేరుగా పశుపతి బాబు అనే భక్తుని యింటికి వెళ్లారు. పశుపతి బాబు భార్య కొంతకాలంగా అస్వస్థురాలుగా వున్నది. అమ్మ కలకత్తా వచ్చారని తెలిసి తన అనారోగ్యం కారణంగా తను అమ్మను దర్శించుకోలేక పోయినందుకు బాధపడి, అమ్మ ను యిలా ప్రార్థించింది: "అమ్మా నువ్వు సర్వాంతర్యామివి కదా? నా బాధ నీకు తెలియటంలేదా? నాకై నేను నీ దర్శనానికి రాలేకున్నాను. దయతో మీరే నా వద్దకు రావచ్చు కదా. నన్ను కరుణించి మీకోసం తపిస్తున్న మీ బిడ్డల వద్దకు వచ్చి మీ దర్శన భాగ్యాన్ని ప్రసాదించండి తల్లీ!" కరుణామయి శ్రీ ఆనందమయి మాతకు ఆమె కన్నీటి ప్రార్థన వినిపించకుండా వుంటుందా? ఆనాడు మధ్యాహ్నం వేళ అలా వీధుల వెంబడి తిరుగుతున్న అమ్మ యెవ్వరికీ యేమీ చెప్పకుండా నేరుగా పశుపతి బాబు యింటికి వెళ్లారు. హఠాత్తుగా తన కళ్ళ యెదుట నిలబడి వున్న అమ్మను చూచి ఆ భక్తురాలికి ఆనందంతో నోట మాట రాలేదు. ఆనందభాష్పాలు కారుస్తూ అమ్మ పాదాలపై

పడింది. సాయంత్రం వరకు ఆమె వద్దనే కూర్చుని ఆమెను ఆశీర్వదించి తిరిగి బాలాబాబు యింటికి చేరుకున్నారు అమ్మ.

ఆ విధంగా పగటివేళ బాలాబాబు యింట్లో అమ్మ దర్శన వేళల నియమం అమలుకు భంగం కలిగింది. రాత్రి 9:00 గంటల వరకు అమ్మ దర్శనం వుంటుందన్న నియమం ప్రకారం ఆనాటి రాత్రి 9:00 గంటల కల్లా భక్తులు యిళ్లకు వెళ్లేందుకు సిద్ధమైనారు. అయితే అమ్మ భక్తులతో మాట్లాడుతూ వుండిపోయారు. మధ్యలో విరామం కూడా లేకుండా యెంతో ఉత్సాహంగా మాట్లాడుతూ వారిని కదలనివ్వలేదు. ఇళ్ళకి వెళ్లే అవకాశమే లేకుండా సంభాషిస్తూ చివరికి రాత్రంతా యెవరినీ నిద్ర కూడా పోనివ్వలేదు అమ్మ. భక్తులతోను, బంధుజన స్త్రీలతోనూ యేవేవో ఛలోక్తులు విసురుతూ తెల్లవారే వరకు హాస్య సంభాషణలతో యెంతో సరదాగా గడిపారు అమ్మ.

ఈ విధంగా అమ్మ విషయంలో యెటువంటి నియమ నిబంధనలు విధించాలన్నా అది సాధ్యమయ్యేది కాదు. అమ్మ యెలాంటి నియమ నిబంధనలకు బంధింపబడరన్న విషయం భక్తులకు యెప్పటికప్పుడు స్పష్టమవుతూ వుండేది.

ఢాకాలో ఆశ్రమ నిర్మాణం జరిగాక ఒకరోజు అమ్మ భక్తులతో, "మీరందరూ యీ నాలుగు గోడల మధ్య యీ చిన్నదైన చోట్లో నన్ను వుంచాలని అనుకుంటున్నారు. అందుకే యిలాంటి ఆశ్రమాలను నాకోసం నిర్మిస్తున్నారు. ఎప్పుడూ నేను మీ దగ్గర వుండాలన్న మీ కోరికలో తప్పేమీ లేదు. మీరంతా కలిసి ఒక చోట చేరి సత్సంగాలు, ఉత్సవాలు దైవ సంబంధమైన కార్యక్రమాలు జరుపుకోవాలని వుత్సాహంగా వున్నారు. అలాంటి వాటికి యీ ఆశ్రమాలను వుపయోగించుకొనండి. నాకోసం యే నిర్మాణాలు చేయనక్కరలేదు. ఎందుకంటే నేను యెప్పుడు యెక్కడ వుంటానో యెక్కడికి వెళ్తానో నాకే తెలియదు. నాకు యే ఆశ్రమమూ అవసరం లేదు" అని చెప్పారు. కాలం గడిచిన కొద్దీ అమ్మ యే ఒక్క ప్రాంతానికి పరిమితులు కారన్న విషయం అందరికీ అర్థం అయింది. కానీ శ్రీ ఆనందమయి అమ్మకోసం భక్తులు యెన్నో చోట్ల యెన్నో ఆశ్రమాలు నిర్మించారు. కానీ అమ్మ యే ఒక్క ఆశ్రమానికి అంకితం కాలేదు. ఎక్కడా స్థిరంగా వుండక, అంతటా సంచరిస్తూ, దేశమంతా తిరుగుతూ జనులందరికీ తన దివ్యబోధలు అందిస్తూ, అనుగ్రహిస్తూ, ఆశీర్వదిస్తూ మన భారతభూమిని అంతటినీ తన దివ్య పాదస్పర్శతో పునీతం చేశారు.

1932వ సంవత్సరం వైశాఖ మాసంలో అమ్మ తన పర్యటన ముగించుకొని ఢాకా వచ్చారు. వచ్చిన కొద్ది రోజులకే జన్మదిన వేడుకలు ప్రారంభమైనాయి. ఈ సంవత్సరం జన్మదిన తిథికి, జన్మదిన తేదీకి మధ్య యిరవై ఒక్క రోజుల వ్యవధి వచ్చింది. ఆ 21 రోజులు అఖండ నామ సంకీర్తన జరపాలని భక్తులు సంకల్పించారు. జన్మదినోత్సవాల ఆరంభానికి ముందు అమ్మ కులదా దాదాతో, "నీ కుమార్తెను కన్యాకుమారీ దేవిగా అలంకరించి కుమారీ పూజ చేయి" అని ఆదేశించారు. కులదా దాదా అమ్మ ఆదేశం ప్రకారం తన కుమార్తెకు కుమారీ పూజ చేశాడు. ఆ తర్వాత గురుప్రియ, శశాంక బాబు, యోగేశ్ దాదా అతుల్, కానూ, కమలాకాంత్ — ఈ ఆరుగురు తాము కూడా కుమారీ పూజ చేసుకుంటామని అమ్మతో చెప్పగా అమ్మ అనుమతించారు. ఈ ఆరుగురూ ఆరుగురు బాలికలకు కుమారీ అలంకరణ చేసి ఒక్కొక్కరు ఒక్కొక్క బాలికను పూజించారు. "ఆధ్యాత్మిక సాధనలో కుమారీ పూజకు కూడా ఒక ప్రత్యేక స్థానం వున్నది. ఈ పూజ సాధనలో పురోగతిని ప్రసాదిస్తుంది" అన్నారు అమ్మ. పూజ అనంతరం వీరందరూ హోమం చేసి ఆ ఆరుగురు బాలికలను విందు భోజనాలతో సత్కరించారు. ఆ తర్వాత వారికి ఫల, పత్ర, పుష్ప తాంబూలాలను దక్షిణగా సమర్పించారు. ఆ తర్వాత అమ్మ కుమారీ పూజ చేసిన ఆ యేడుగురునీ ప్రతిరోజు పండ్లు, పువ్వులు హోమంలో వెయ్యాలని 21 రోజులపాటు అఖండ నామ సంకీర్తన చేస్తూ దేవతలకు కిచిడీ నియమనిష్ఠలతో వండి నైవేద్యం యివ్వాలని, ప్రతిరోజు కిచిడీ మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ నియమనిష్ఠలతో వుండాలని వారిని ఆదేశించారు.

ఈ సంవత్సరం జన్మదిన వేడుకలకు కొద్దినెలలు ముందుగానే ఆశ్రమంలోని మందిరాలలోని పాత విగ్రహాల స్థానంలో కొత్తవి ప్రతిష్ఠించాలని వాటిని సిద్ధం చేశారు. అష్టధాతువులతో యెంతో అందంగా మలచబడిన అన్నపూర్ణాదేవి, కాశీ విశ్వేశ్వరస్వామి, కాళికాదేవి విగ్రహాలు, కాశీ నుండి శశాంకబాబు తెప్పించిన తెల్లరాతి పరమశివుని విగ్రహం ఆశ్రమంలో ప్రతిష్ఠించారు.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి ఎం. అన్నపూర్ణమ్మ, హైదరాబాద్

ఒకసారి నేను తాడేపల్లిగూడెం నించి ఏలూరు వెళ్ళడానికి బస్టాండ్ కి రిక్షా ఎక్కి 100 రూపాయల నోటు ఇచ్చాను. 'ఆ నోటు చెల్లదు' అన్నాడు. నా దగ్గరున్న చిల్లర యిచ్చాను. తరవాత ఒక షాప్ లో ఈ నోటు ఇస్తే, 'ఇది చెల్లదు' అన్నాడు. ఆ తర్వాత ఏలూరు వెళ్లే బస్సు ఎక్కి టికెట్ కోసం ఈ 100 రూపాయల నోటు కండక్టర్ కి ఇస్తే 'ఈనోటు చెల్లదు' అన్నాడు. సరేనని బస్సు దిగిపోయాను. ఇక అక్కడి నుండి రైల్వే స్టేషన్ కి వెళ్ళాను. నేను ఆ డబ్బుల తోనే మా ఊరు వెళ్ళాలి. ఇక్కడ కూడా చెల్లదంటే ఎలాగా అనుకుంటూ, అప్పుడు బాబా గుర్తుకొచ్చి, "నువ్వు నిజంగా దేవుడివైతే, నీకు మహిమే వుంటే, యిక్కడ యీ నోటు చెల్లాలి" అనుకుని, రైల్వే కౌంటర్ లో టికెట్ కోసం ఆ నోటు యివ్వగానే తీసుకున్నారు, హమ్మయ్య అనుకునే లోపే, 'ఇది చెల్లదండి' అని యిచ్చేసారు. అప్పుడు నాకు చాలా బాధ వేసి, 'నీ దగ్గర ఏమీ మహిమ లేదు' అనుకుంటున్న సమయంలో, మా పక్కనే మగవాళ్ల వరుసనించి ఒకాయన, 'ఆ నోటు యిటు యివ్వండి, నేను చిల్లర యిస్తాను' అన్నారు. ఈ నోటు ఎక్కడా చెల్లలేదండి అంటే,,,'ఫరవాలేదు నేను బ్యాంక్




లో మారుస్తాను' అని చెప్పి ఆ నోటు తీసుకుని, నాకు 100 రూపాయలు ఇచ్చారు. ఈ విధంగా బాబా ఆ వ్యక్తి రూపంలో నన్ను కాపాడి వారి మహిమ చూపించారు.

ఒకసారి మావారు స్నేహితులతో కలిసి శిరిడీ కి వెళ్లారు. ఆయనకి బాగా సిగరెట్ కాల్చే అలవాటుండేది. దర్శనానికి వరుసల్లో నిల్చున్నారు, కానీ బైటికి వెళ్లి సిగరెట్ తాగాలనిపిస్తోందిట. అప్పుడు వాళ్ళ స్నేహితులు, 'మనకి ఏదైనా సమస్య వుంటే ఒక చీటీ మీద వ్రాసి ధునిలో వేస్తే ఆ సమస్య తీరిపోతుంది' అని చెప్పారట. వెంటనే మావారు తనకి సిగరెట్ మానాలని వుంది కానీ మానలేక పోతున్నానని వ్రాసి ధునిలో వేశారట. ఆ క్షణం నించి యిక సిగరెట్ తాగాలనిపించలేదట. ఇంటికి వచ్చాక, జరిగింది చెప్పి, సిగరెట్ మానేశానని చెప్పారు, నేను నమ్మలేదు. చాలాసార్లు ఇలా అనుకోవడం, మానలేక పోవడం జరిగింది.కానీ యీసారి నిజంగానే మానేశారు. అదంతా బాబా దయవల్ల మాత్రమే జరిగింది.

ఒక 40 సంవత్సరాల క్రితం మా బంధువులతో కలిసి శిరిడికి వెళ్ళాము. వెళ్ళేటప్పుడు రిజర్వేషను చేయించుకున్నాము కానీ, వచ్చేటప్పుడు చేయించలేదు. అప్పట్లో శిరిడీ లో రద్దీ ఎక్కువగా వుండేది కాదు. తిన్నగా బాబా దర్శనానికి వెళ్లిపోయే వాళ్ళం. అక్కడ మూడు రోజులు వుండాలని నిర్ణయించుకున్నాము. అప్పుడు బాబాని 'మేము వెళ్లే లోపున నాకేదైనా నిదర్శనం చూపించ' మని ప్రార్థించాను. మూడురోజులు పూర్తయ్యి తిరిగి బయలుదేరాము. నేను కోరినట్టు బాబా మహిమ చూపించలేదు అనుకున్నాను. రిజర్వేషను లేని కారణంగా మన్మాడ్ లో రైలు రాగానే సాధారణ బోగీ ఎక్కేసాము. చాలా రద్దీగా వుంది. మా మగవారు ఎక్కలేదని తిరిగి మేము దిగిపోయాము. వాళ్లేమో, 'ఎందుకు దిగిపోయారు మేము వేరే బోగీలో ఎక్కేవాళ్ళాము కదా' అని అన్నారు. ఈలోపు రైలు బయలుదేరి పోయింది.

**మిగతా 29వ పేజీలో**

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ శ్రీనివాస్**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని కావలికి చెందిన శ్రీనివాస్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను 1998 - 99 ప్రాంతంలో కావలినుంచి మా అక్క కల్యాణివాళ్ళ ఇంటికి ఒంగోలుకు వచ్చాను. అక్కడ వున్నప్పుడు బాబా గుడికి వెళ్లడం అలవాటైంది. అక్కడ రంగారావుగారు, లలిత మేడం, హరి, నాగేశ్వరరావు, రామకృష్ణ... వీళ్ళతో పరిచయమై పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు ఎంత గొప్పవారో తెలుసుకున్నాను. నేను చిన్న ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడిని. సాయంత్రం వచ్చాక పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్లి సేవచేసుకుంటుండేవారం. రాత్రి సేవంతా పూర్తయ్యాక మేమందరం పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి మాట్లాడుకుంటూ సాధ్యమైనంత ఎక్కువసేపు గడిపేవారం. కనుక చాలా ఆలస్యంగా ఇంటికి వెళ్ళేవాడిని. మా బావగారు నన్ను బాగా కోప్పడేవారు. అయినా ఏమీ పట్టించుకునేవాడిని కాదు. నన్ను పూజ్యశ్రీ మాస్టరుగారు అంతగా ఆకర్షించారు.

అదేవిధంగా ఎప్పుడైనా తెల్లవారుఝామున వర్షం పడుతుంటే, 'అయ్యో మాస్టరుగారు తడిసిపోతా' రనిపించి అప్పటికప్పుడే గుడికి వచ్చేసేవాడిని. అప్పట్లో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మీద రేకులతో ఆచ్ఛాదన మాత్రమే వుండేది. రేకుల మధ్య వున్న సందులలోంచి నీళ్లు కారేవి. ఆ నీళ్లు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మీద పడేవి. 'అయ్యో మనమేమో ఇంట్లో హాయిగా పడుకున్నాం, పూజ్యశ్రీ మాస్టరుగారు తడిసిపోతారే!' అనిపించి గుడికి వచ్చేవాడిని. నేను బయట సినిమాలకి, షికార్లకి తిరిగేవాడిని కాదు. ఖాళీ సమయం వుంటే గుడిలోనే నా మకాం. అలాగే మా అక్కని కూడా రమ్మని చెప్తుండేవాడిని. కొంతకాలానికి తను కూడా గుళ్లో సేవకి వచ్చేది.

ఆ రోజుల్లో ఎవరైనా, ఎప్పుడైనా తోచినది నివేదన చేసుకుని, కర్పూరం తెచ్చుకుని హారతి చేసుకోవచ్చు. నేను, ఒక రూపాయి దక్షిణ పెట్టి, రెండుమూడు బిస్కట్లు తెచ్చి నివేదన పెట్టి, కర్పూరం వెలిగించి బాగా పెద్దగా శిష్యప్రియహారతి పాడేవాడిని. నా గొంతు రోడ్డు దాకా వినిపించేది. అయితే అలా నేనొక్కడినే హారతి యిస్తున్నప్పుడు నా వెనుక చాలామంది వున్నట్లు అనిపించేది కానీ అక్కడ నేనొక్కడినే వుండేవాడిని. ఇప్పుడు ఆలోచించుకుంటే పూజ్యశ్రీ మాస్టరుగారు నా భవిష్యత్తు ఆ రకంగా సూచించారేమోననిపిస్తుంది.

నేను చాలా ఉద్యోగాలు మారాను. ఎక్కడా పరిస్థితులు సరిగ్గా వుండేవి కాదు. రకరకాల సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల సమస్యలు వచ్చినట్లే వచ్చి అన్నీ సమసిపోతుండేవి. అలా చాలా సందర్భాలలో పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను కాపాడారు. ఆయనే నాకు పరిచయం కాకపోతే నా జీవితం ఎలా వుండేదో ఊహకే అందదు. వారి గొప్పతనాన్ని అక్కడవున్న భక్తులద్వారా వింటున్నప్పుడు హృదయం పులకించిపోయేది. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు కలలో కనిపించి, "వెళ్ళరా వెళ్ళు!" అని చెప్తున్నారు. నేను పాదనమస్కారం చేస్తుంటే కూడా పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారు. అప్పుడు కలలోనే రంగారావుగారి అమ్మాయి పెళ్లి వుందని, అదయ్యాక వెళతాననీ చెప్పాను. మళ్ళీ ఇంకొకసారి అలాగే కోపంగా వెళ్ళమని హెచ్చరించారు. కానీ ఎక్కడికి వెళ్ళాలో చెప్పలేదు. అప్పుడు నేనొక ముఖ్యమైన కార్యం తలపెట్టాను. అదయ్యాక చూడొచ్చులే అనుకున్నాను. అదేమిటంటే

ఒకసారి నేను గొలగమూడి వెళ్ళినప్పుడు వెంకయ్య స్వామి ఉత్సవ విగ్రహం చూశాను. వెంటనే నాకనిపించింది, 'ఒంగోలులో బాబాకి, అమ్మవారికి, రాములవారికి.. అందరికీ విగ్రహాలున్నాయి. పూజ్యశ్రీ మాస్టరుగారికి కూడా వుంటే బాగుంటుంది కదా, వారికి పల్లకీసేవ చేసుకోవచ్చు!' అని. ఆ విషయం బాబా గుడి కమిటీ వారితో అంటే, "మీరందరూ పూనుకుని చేసుకుంటే మాకేమీ అభ్యంతరం లేదు!" అన్నారు. నేను, నా స్నేహితుడు వెంకటస్వామి దీనికి పూనుకుని చాలామంది సహకారంతో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం తయారు చేయించాము. అప్పుడు కమిటీవారు గుళ్లో విగ్రహాలన్నింటికీ చల ప్రతిష్ఠ చేస్తామన్నారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి తరపున పీటలమీద ఒక దంపతులను కూర్చోమన్నారు. వెంకటస్వామి దంపతులు కూర్చోవడానికి నిర్ణయమైంది. కానీ తీరా ప్రతిష్ఠ సమయానికి అతనికి ఏదో ఆటంకం వస్తే, నేనూ, నా భార్య కూర్చుని కార్యక్రమం చేశాము. ఇది పూజ్యశ్రీ మాస్టరుగారి కృపాకటాక్షం!

కాలాంతరంలో నేను నెల్లూరుకు వెళ్లిపోవలసి వచ్చింది. అది పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రణాళిక అని తరువాత అర్థమైంది. నెల్లూరులో నేను కేబుల్ ఆపరేటర్‌గా స్థిరపడ్డాను. అక్కడ నాకు ఎవ్వరూ పరిచయం లేరు. ప్రతిరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనం అలవాటున్న నాకు, 'ఎక్కడికెళ్ళాలి? ఏదైనా ఎవరితో చెప్పుకోవాలి?' అనిపించేది. జేబులో సీజన్ టికెట్ పెట్టుకుని ఎప్పుడు ఒంగోలు వెళ్లాలనిపిస్తే అప్పుడు రైలెక్కేసేవాడిని.

అలా ఒకసారి వెళ్ళినప్పుడు ఒంగోలు మందిరంలో సేవ చేసుకునే ఒక అమ్మాయి, శ్రీ వెంకయ్యస్వామి సమాధికి వస్త్రం ఇచ్చి గొలగమూడిలో సమర్పించమని కోరింది. ఆ వస్త్రాన్ని తీసుకుని, దానితోపాటు కొన్ని శ్రీ సాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర గ్రంథాలు కూడా గొలగమూడి తీసుకెళ్లాలని సంకల్పించి నెల్లూరుకు బయలుదేరి స్టేషనుకి వచ్చాను. తీరా నెల్లూరులో దిగాక చూసుకుంటే చేతిలో సంచీ లేదు! అంటే ఒంగోలు స్టేషనులో మర్చిపోయాను. ఇక చేసేదేమీ లేక ఇంటికెళ్లిపోయాను. మళ్ళీ కొన్ని రోజులకు ఒంగోలుకు వెళ్ళినపుడు రైల్వేస్టేషనులో కౌంటరులో అందరినీ అడిగాను. ఎవరూ ఏమీ చూడలేదన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకొస్తే ఆ అమ్మాయి నన్ను చూడగానే, "అన్నా! వస్త్రం ఇచ్చావా?" అనడిగింది. నేను మౌనంగా అవునని, కాదని చెప్పక మధ్యస్థంగా తల ఊపాను. అలా నాలుగైదు నెలలు జరిగిపోయింది. అక్కడకి వెళ్ళినప్పుడల్లా ఆ అమ్మాయి అడుగుతుండేది. 'ఈసారైనా ఇచ్చావా?' అన్నట్లు. నేను నా పద్ధతిలోనే తలూపేవాడిని. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర చాలా బాధపడ్డాను -- "ఏంటి మాస్టారూ! చాలా విలువైన మీ గ్రంథాలు, ఎంతో విలువైన వెంకయ్యస్వామి వస్త్రం పోగొట్టాను. మీరు ఎలాగైనా వాటిని నాకు ఇప్పించాలి. ఆ అమ్మాయి ఎంతో నమ్మకంతో నాకు చెప్పిన సేవ నేను చేయలేకపోయాను!" అని చాలా సేపు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర కూర్చుని బాధపడ్డాను. చిత్రంగా నేను బయలుదేరి రైల్వే స్టేషనుకి రాగానే అక్కడ వున్న పోలీసు కానిస్టేబుల్ నన్ను పిలిచి, "నువ్వు ఎప్పుడూ అడుగుతుండే ఆ సంచి (రైల్వే స్టేషన్లో వుండే) పోలీసుస్టేషనులో వుంది తీసుకో!" అన్నాడు. నేను ఆశ్చర్యపోతూ పూజ్యశ్రీ మాస్టరుగారికి మనస్సులోనే ప్రణామాలర్పించి, అవి దొరికినందుకు కృతజ్ఞతగా నేను పట్టుకెళ్లిన శ్రీసాయి లీలామృతం, శ్రీగురుచరిత్ర గ్రంథాలన్నీ అక్కడి ఉద్యోగులకు పంచేసి, వస్త్రం వెంకయ్యస్వామివారికి సమర్పించాను. అదీ పూజ్యశ్రీ మాస్టరుగారి దయ!

నెల్లూరులో నేనున్న ఇంట్లో ఇదివరకు నాగమునీంద్ర స్వామి ధుని వేశారట. ఆ ప్రదేశం లోనే నేను బాబా, మాస్టరుగారి ఫోటో పెట్టుకుని, ఒక్కడినే సత్సంగం చేసుకునే వాడిని. ఒకసారి సత్సంగమయ్యాక వెనక్కి చూడగానే 80 ఏళ్ళ ఆమె నిల్చుని వుంది. ఆమె అక్కడికి దగ్గరలోనే వుంటామని చెప్పింది. అలా ఆమెతో మొదలైన సత్సంగానికి గోపాల్ గారు, పద్మయ్యగారు మొదలైనవారు వస్తుండేవారు.

ఒకసారి విద్యానగరులో సత్సంగం జరుగుతోంది, రమ్మని గురుబంధువులు నన్ను పిలిచారు. సత్సంగానికి వెళ్లాను. అక్కడ మెట్టు శ్రీనివాసులరెడ్డిగారితో, 'మా ఇంటికి కూడా వచ్చి సత్సంగం చెయ్యమ'ని అడిగాను. అలాగే ఆయన వచ్చి చెప్పారు. అలా ఆయన 3 సంవత్సరాలు నెల్లూరు మా ఇంటికి వచ్చారు. ఆయన వచ్చినప్పుడు ఉదయంనుంచి సాయంత్రం దాకా సత్సంగం జరిగేది.

ఇలా జరుగుతున్న సమయంలో మల్లిఖార్జునరావుగారు ఒకసారి మా ఇంటికి వచ్చారు. ఆయన మాకు బంధువు

కూడా. ఆయన జె. జె. పేట గుళ్లో పూజారిగా చేసేవారు. ఆయనకు పూజ్యశ్రీ మాస్టరుగారు పాదుకలు ఇచ్చారు. వాటిని నాకు ఇస్తూ, "నేను ప్రస్తుతం జె. జె. పేట గుళ్లో పూజారిగా మానేశాను. మళ్ళీ ఇంకొక గుళ్లో చేరేవరకు ఈ పాదుకలు నీ దగ్గర వుంచు!" అని చెప్పారు. అలా పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంట్లో నాలుగు నెలలు వున్నారు.

ఆ సమయంలో నేను ఒకసారి ఒంగోలు వెళ్లి పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దగ్గర ప్రదక్షిణం చేస్తూంటే, శ్రీ గురుడు అంతర్ధానమైన రోజున 11 మంది బ్రాహ్మణులచేత రుద్రాభిషేకం చేయించమని విపరీతమైన ప్రేరణ వచ్చింది. అప్పుడు మా ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలుండటంవల్ల మాఘ బహుళ పాడ్యమినాడు పాదుకలకు రుద్రాభిషేకం చేయించాను. ఇది జరిగి ఇప్పటికి 14 సంవత్సరాలు. దాదాపు ఇప్పటివరకూ చాలా మహాత్ముల మందిరాలలో (ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర కూడా) శ్రీగురుడు అంతర్ధానమైన రోజున రుద్రాభిషేకాలు జరుగుతూనే వున్నాయి.

మా ఇంట్లో రుద్రాభిషేకం జరిగినప్పుడు జయచంద్రారెడ్డిగారువాళ్లు వచ్చారు. అప్పుడు వాళ్ళు, 'మా దత్త సాయి మందిరంలో మీరు పారాయణలు చెయవచ్చు కదా!' అన్నారు. అలా మేము కొంతమందిమి కలిసి పారాయణలు చేస్తూ వున్నాము. కొంతకాలానికి నాకు శ్రీగురుచరిత్ర ప్రవచనాలు చేయించాలనిపించింది. పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థులందరినీ అడిగాను. శ్రీగురుచరిత్ర అనగానే ఎవరూ ముందుకు రాలేదు. చెన్నయ్యగారు నేను ప్రయత్నం చేస్తానని మొదలుపెట్టారు. ఇప్పటికి తొమ్మిది సంవత్సరాలకు ముందు మొదలైన శ్రీగురుచరిత్ర ప్రవచనాలు, మొన్న గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు వచ్చేవరకూ కొనసాగాయి. ఇదంతా కూడా ముమ్మాటికి పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహమే!

పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను ఒంగోలునుంచి నెల్లూరుకు రప్పించి, ఇక్కడ కూడా వారి సేవచేసుకునే భాగ్యాన్ని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, జన్మ జన్మలకూ వారి సేవాభాగ్యాన్ని అనుగ్రహించవలసినదిగా అంజలి ఘటించి ప్రార్థిస్తున్నాను.

ఓం సత్సంగప్రదాయ శ్రీ భరద్వాజ గురువే నమః!

## ద్వారకామాయి అనుభవమంటపము

26వ పేజీ తరువాయి

అప్పుడు ఇంకా అయోమయం అయిపోయాము. ఎందుకంటే రేపటిదాకా ఇక్కడ ఎలా గడపాలి అన్న ఆలోచనతో గాబరావేసింది. ఇంతలో నెమ్మదిగా రైలు ఆగింది. మేము ఆశ్చర్యంగా చూస్తుంటే, రైలులో వాళ్ళు ఎక్కండి ఎక్కండని మమ్మల్ని తొందర చేశారు. మేము మా కెదురుగా వున్న బోగీ లోకి ఎక్కేసాము. అందులో ఒక్క మనిషి కూడా లేరు. అది ఆడవాళ్ళ బోగీ,,,,అందరం కూర్చున్నాక రైలు కదిలింది. కాసేపటికి టి.సి. వచ్చి విషయం అంతా విని, మా మగవాళ్ళని తీసుకెళ్లి పక్క బోగీ తలుపు తీయించి వాళ్ళకి అక్కడ ఏర్పాటు చేశారు. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఇది ఎలా సంభవం అయింది? సీటే దొరకదు అనుకుంటే హాయిగా పడుకోడానికి కూడా ఏర్పాటు చేశాడు బాబా. నేను ఏదైనా మహిమ చూపించమంటే ముందు బాగా చెమటలు పట్టేలా హడలకొట్టి, తరవాత ఎంతో ఆదరణ చూపించారు. అయినా ఇంతకు ముందు చూపించిన మహిమలు సరిపోలేదు నాకు. ఇక ఎప్పుడైనా మహిమ చూపించు అని అడగాలంటే, ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని అర్థమైంది.

నేను కొన్నాళ్ళు ధ్యానం చేద్దామని ప్రయత్నం చేసాను. ఒకసారి ధ్యానానికి కూర్చుంటే, ధ్యానం కుదరలేదుకానీ, నిద్ర వచ్చింది. ఆ నిద్రలో ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో,,,,బాబా ఒక పళ్ళెంలో అన్నం కలిపి, ఒక ముద్ద నా నోట్లో పెడుతున్నారు. 'ఛీ, చద్దన్నం నాకు వద్దు' అని వారి చెయ్యి తోసేసాను. అదీ స్వప్నం! నాకు చిన్నప్పటినించి చద్దన్నం అంటే యిష్టం వుండదు. వేడి వేడి అన్నం తినడం ఇష్టం. అంటే బాబా అంతటివారు అన్నం పెడుతుంటే కూడా చద్దన్నమని తినలేదు, స్వప్నంలో కూడా దానిమీద ఎంత అయిష్టతో కదా! అనుకున్నాను. తరవాత మాకు చాలా కష్టాలు వచ్చాయి. బాబా నాకు అదృష్టం అనే ముద్ద పెడుతుంటే తోసేసానేమో అని బాధ పడేదాన్ని. అప్పుడు, వారినే నమ్ముకుని పారాయణ చేసుకుంటూ వుంటే, కరుణతో తిరిగి ఒడ్డున పడేసారు. ఈనాటికీ మా కష్టసుఖాల్లో వారే అండగా వుండి మమ్మల్ని కనిపెట్టి కాపాడుతున్నారు.

సమర్థ సద్గురు సాయినాథునికి శతకోటి వందనాలు!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి తృతీయ ఆరాధనా మహోత్సవము తిథి ప్రకారము మే నెల 31 న గుమ్మళంపాడు గ్రామ శివారులో వున్న వారి దివ్య సన్నిధానములో భక్తులందరూ వైభవంగా జరుపుకున్నారు

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి తృతీయ ఆరాధనా మహోత్సవము జూన్ నెల 3వ తేదీన ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, గుమ్మళంపాడు గ్రామ శివారులో వున్న వారి దివ్య సన్నిధానములో పూజ్య గురు పుత్రులు శ్రీ ద్వారక బాబు గారు, పూజ్య గురు పుత్రిక శ్రీమతి వేదమ్మ గార్లతో కలిసి భక్తులందరూ వైభవంగా జరుపుకున్నారు.

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.